

- 20 రోజుల్లో ముగియనున్న సర్పంచ్‌ల పదవీ కాలం
- ఎన్నికలపై ఎలాంటి ప్రకటన చేయని ప్రభుత్వం
- ప్రత్యేక అధికారులా.. పర్సన్ ఇన్‌చార్జిలా..?
- ఇప్పట్లో ఎన్నికలు జరిగే అవకాశాలు మృగ్యం
- పార్లమెంటు ఎన్నికలపై 'స్థానిక' ప్రభావం
- వాయిదా వేయడమే మంచిదన్న అధికార పార్టీ ఎమ్మెల్యేల అభిప్రాయం
- సకాలంలో నిర్వహించకపోవడంతో 'ప్రత్యేక' పాలన
- సర్పంచ్‌లుగా పోటీ చేస్తామనుకున్న వారి ఆశలు అడియాసలయ్యే అవకాశం

ప్రశ్నార్థకంగా పంచాయతీ సమరం!



రఘునాథపల్లి జీపీ కార్యాలయం

రఘునాథపల్లి, జనవరి 11: రాష్ట్రంలో 'పంచాయతీ' సమరం.. ప్రశ్నార్థకంలో పడింది. ప్రస్తుత సర్పంచ్‌ల పదవీకాలం మరో 20 రోజుల్లో ముగియనుంది. కొత్తగా కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం 'పంచాయతీ' సమరంపై ఇప్పటివరకు ఎలాంటి ప్రకటన చేయకపోవడంతో ఇప్పట్లో ఎన్నికలను నిర్వహించే ఉద్దేశం ప్రభుత్వానికి లేదని స్పష్టమవుతోంది. మూడు నెలల్లో జరిగే పార్లమెంటు ఎన్నికలపై స్థానిక ఎన్నికల ప్రభావం చూపే అవకాశాలున్నాయని, ఈ నేపథ్యంలో ఎన్నికలను వాయిదా వేయడమే మంచిదని కొత్త ప్రభుత్వం నిర్ణయించుకున్నట్లు అవగతమవుతుంది. పంచాయతీ పాలకవర్గాల పదవీ కాలం 20 రోజుల్లో ముగుస్తుండడంతో పంచాయతీల్లో ప్రత్యేక అధికారుల పాలన, లేకుంటే పర్సన్ ఇన్‌చార్జిలుగా సర్పంచ్‌లను నియమించాల్సి ఉంటుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2005, 2011లో ఇలాగే పంచాయతీపాలక వర్గాల పదవీకాలం ముగిశాక అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఒకసారి పర్సన్ ఇన్‌చార్జిల పాలనకు మరోసారి ప్రత్యేక అధికారుల పాలనకు తెరలేపింది. స్థానిక ఎన్నికల్లో సత్తాచాటాలని ఉవ్విళ్లూరుతున్న ఔత్సాహికులకు తాజా పరిణామాలు ఆశని పాతంగా మారాయి. జనగామ జిల్లాలో 281 గ్రామ పంచాయతీలలో 6,95,125 మంది ఓటర్లు ఉన్నారు.

రిజర్వేషన్లపై సందిగ్ధం

జిల్లాలోని 281 గ్రామాలకు 2019లో జరిగిన పంచాయతీ ఎన్నికలు మూడు విడతలుగా జరిగాయి. జనవరి 21న మొదటి విడత, జనవరి 25న రెండో విడత, జనవరి 30న మూడో విడత ఎన్నికలు జరిగాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఫిబ్రవరి 2న సర్పంచ్‌ల పదవీ ప్రమాణస్వీకారం జరిగింది. పంచాయతీలకు ఐదేళ్లకోసారి తాజా రిజర్వేషన్లు ప్రకటించి ఎన్నికలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.అయితే గత బీఆర్ఎస్ ప్రభుత్వం చట్ట సవరణచేసి స్థానిక సంస్థల్లో కాల పరిమితిని ప్రతి పదేళ్లకోసారి సవరించాలని నిర్ణయించింది. దీంతో ఒకసారి రిజర్వేషన్ ప్రకటిస్తే ఆ కేటగిరీ వారు రెండుసార్లు పోటీ చేసే అవకాశం ఉంటుంది. ఈ నిబంధనల ప్రకారమైతే గత ఎన్నికల్లో పంచాయతీలకు కేటాయించిన రిజర్వేషన్లే ఈ సారి అమలు చేయాలి. అయితే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరడంతో ఐదేళ్ల కిందట ఖరారు చేసిన రిజర్వేషన్లను కొనసాగించడానికి సుముఖంగా లేదు. ప్రస్తుత పంచాయతీ పాలకవర్గం పదవీకాలం ఫిబ్రవరి ఒకటో తేదీతో ముగుస్తుంది. మూడు నెలల్లో జరుగబోయే పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పంచాయతీ ఎన్నికలను వాయిదా వేసేందుకు ప్రభుత్వం సిద్ధపడింది. పార్లమెంట్ ఎన్నికల తర్వాతనే కొత్త రిజర్వేషన్ ప్రక్రియ ద్వారానే పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలనే ఆలోచనలో ప్రస్తుత ప్రభుత్వం ఉన్నట్లు అవగతమవుతుంది.

ఎన్ని'కలే'నా..

పంచాయతీ ఎన్నికలపై ప్రభుత్వం ఇప్పటివరకు ఎలాంటి ప్రకటన చేయకపోవడంతో సర్పంచ్‌గా పోటీ చేస్తామని కలలు కన్న అభ్యర్థుల ఆశలు ఎన్ని'కల'గానే మిగిలిపోయింది. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో అధికారం చేపట్టినందున పంచాయతీ ఎన్నికలు సకాలంలో జరిగితే అలవోకగా సర్పంచ్‌లుగా ఎన్నికవొచ్చని కలలుగన్న అధికార పార్టీకి చెందిన నాయకుల ఆశలు.. అడియాశలు గానే ఉండిపోయాయి. మరో మూడు నెలల్లో పార్లమెంటు ఎన్నికలు ఉన్నందున.. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఒక అభ్యర్థిని బల పరిస్తే మరో అభ్యర్థి పార్టీకి దూరమయ్యే అవకాశానికి తావిస్తే ఆ ప్రభావం పార్లమెంటు ఎన్నికల ఫలితాలపై పడే అవకాశముందని భావించిన కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం పార్లమెంటు ఎన్నికలు ముగిశాకనే పంచాయతీ ఎన్నికలను నిర్వహించడానికి మొగ్గు చూపుతుంది.

ప్రత్యేక అధికారులా.. పర్సన్ ఇన్‌చార్జిలా..?

పంచాయతీ ఎన్నికలు సకాలంలో జరిగే అవకాశం లేనందున ఫిబ్రవరి 2 నుంచి పంచాయతీల పాలన ప్రత్యేక అధికారుల చేతికా.. పర్సన్ ఇన్‌చార్జీల చేతికి వెళ్తుందా అనేది ఇప్పుడు హాట్‌టాపిక్‌గా మారింది. జీవో నంబర్ 113 ప్రకారం గ్రామ పంచాయతీలకు సకాలంలో ఎన్నికలు నిర్వహించకుంటే ప్రత్యేక అధికారులను గాని, లేదా ప్రస్తుతం ఉన్న సర్పంచ్‌లనే పర్సన్ ఇన్‌చార్జీలుగా నియమించే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉంది. ప్రత్యేక అధికారులను నియమిస్తేనే పంచాయతీల్లో పాలన సాఫీగా సాగే అవకాశ ముందని పలువురు అభిప్రాయపడుతున్నారు. జిల్లాలో మెజార్టీ గ్రామ పంచాయతీ సర్పంచ్‌లు గతంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్‌కు చెందిన వారే ఉన్నారు. ఈ నేపథ్యంలో సర్పంచ్‌లను పర్సన్ ఇన్‌చార్జీలుగా నియమించేందుకు రాష్ట్రంలో కొత్తగా అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం సుముఖత చూపకపోవచ్చన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో పంచాయతీ ఎన్నికలు జరిగేవరకు ప్రత్యేక అధికారులను నియమించే అవకాశాలే మెండుగా ఉన్నాయని రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. గతంలో 2005లో సర్పంచ్‌ల పదవీకాలం పూర్తయిన వెంటనే అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం 14 నెలల పాటు సర్పంచ్‌లనే పర్సన్ ఇన్‌చార్జీలుగా నియమించింది. తదనంతరం 2011లో సర్పంచ్‌ల పదవీకాలం ముగియగానే అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం 2011 నుంచి 2013 వరకు ప్రత్యేక అధికారులను నియమించింది.



ప్రత్యేక అధికారుల పాలనకు కసరత్తు..!

పాలకవర్గాల పదవీకా లం 20 రోజుల్లో ముగియనున్నందున.. ప్రతీ గ్రామపంచాయతీకి ప్రత్యేక అధికారి ని నియమిం చేందుకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇప్పటినుంచే పంచాయతీ రాజ్‌శాఖ అధికారులు కసరత్తు ప్రారంభించారు. ప్రత్యేక అధికారులుగా ఎంపీడీవోతో పాటు తహసీల్దార్, ఎంపీవో, ఆర్ఐలు, సర్వేయర్లు, ఎంఈవోలు, ఈజీఎస్, ఐకేపీ సిబ్బందిని ఎంపిక చేసే కార్యక్రమంలో పంచాయతీరాజ్‌శాఖ అధికారులు తలమునకలవుతున్నారు.

మహాజాతర సక్సెస్ కావాలి

- ప్రతిఒక్కరూ బాధ్యత తీసుకోవాలి
- ఐటీడీఏ పీవో అంకిత్
- ఆదివాసీ సంఘాలు, పూజారులతో సమావేశం



ఐటీడీఏలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న పీవో అంకిత్

ఏటూరునాగారం రూరల్, జనవరి 11: మేడారం మహాజాతరను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని ఐటీడీఏ అంకిత్ అన్నారు. ఏటూరునాగారం ఐటీడీఏ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఆదివాసీ సంఘాలు, పూజారులతో ఆయన గురువారం సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. మహాజాతరను విజయవంతం చేయడానికి చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. మహాజాతరను విజయవంతంగా నిర్వహించేందుకు ఆదివాసీ సంఘాల నేతలు, పూజారులు జిల్లా యంత్రాంగానికి సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా పలు ఆదివాసీ సంఘాల నాయకులు, పూజారులు మాట్లాడుతూ జాతరలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో భాగస్వామ్యం చేయాలని విజ్ఞప్తి చేశారు. మద్యం, కొబ్బరి, బెల్లం దుకాణాలను ఆదివాసీ సంఘాలు, పూజారులకే కేటాయించాలని పీవోను కోరారు. అదేవిధంగా సాధారణంగా షాపు యజమానులకే వర్తించే ధరలకే మేడారంలో మద్యం సరఫరా చేయడంపై ఎక్సైజ్ శాఖ దృష్టి పెట్టాలని అన్నారు. మేడారం ట్రస్ట్‌బోర్డు కమిటీలో గిరిజనేతరులకు అవకాశం కల్పించొద్దని విన్నవించారు. దీనిపై పీవో మాట్లాడుతూ ప్రతిపాదించిన అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. జాతరలో ఆదివాసీ సంఘాలు, పూజారులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపడతామన్నారు. జాతరకు వచ్చే భక్తులు అన్ని రకాల సేవలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఆదివాసీల సంస్కృతీ సాంప్రదాయాలకు విఘాతం కలగకుండా జాతర నిర్వహణ చేపడుతామన్నారు. అందరి సూచనలు, సలహాలు తీసుకొని జాతరను దిగ్విజయం చేద్దామన్నారు. ఈ సమావేశంలో ఏపీవో వసంతరావు, ఏవో దామోదరస్వామి, ఎస్‌వో రాజ్‌కుమార్, మేనేజర్ శ్రీనివాస్, ఆదివాసీ సంఘాల నాయకులు, పూజారులు సిద్దబోయిన జగ్గారావు, దాట్ల నాగేశ్వరరావు, పోడెం బాబు, పోడెం రత్నం, కొప్పుల రవి, కృష్ణప్రసాద్, ఘైపతి అరుణ్‌కుమార్, లక్ష్మణ్‌రావు, సుభద్ర, కబ్బాక శ్రావణ్ కుమార్, గొప్ప సమ్మారావు, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

సోమన్న ఆలయానికి రూ. 6. 84 లక్షలు

పాలకుర్తి, జనవరి 11 : శ్రీ సోమేశ్వరలక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో అభిషేకం, వాహన పూజ సామగ్రి కోసం సీల్డ్ టెండర్లు నిర్వహించగా రూ. 6.84 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో లక్ష్మీప్రసన్న తెలిపారు. పాలకుర్తి మండల కేంద్రంలోని ఆలయ కళ్యాణ మండపంలో గురువారం నిర్వహించిన సీల్డ్ టెండర్ డ్రా కార్యక్రమాన్ని చేపట్టారు. టెండర్ వేసేందుకు దరావత్తు సొమ్ము ద్వారా రూ. 6. 60 లక్షలు ఆదాయం రాగా, ఇతర షెడ్యూల్ ద్వారా రూ. 24 వేలు ఆదాయం సమకూరినట్లు ఆమె తెలిపారు. సీల్డ్ టెండర్ డ్రాలో 66 మంది పాల్గొని షెడ్యూల్ కొనుగోలు చేయగా దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిష నర్ మహేంద్ర ఆధ్వర్యంలో డ్రా కార్యక్రమాన్ని చేపట్టారు. మండలంలోని తిర్మలగిరి గ్రామానికి చెందిన కూటికంటి నరేష్ టెండర్‌ను దక్కించుకున్నాడని ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఆలయ పూజారులు డీ.వీ.ఆర్ శర్మ, ఆలయ సిబ్బంది వెంకటయ్య, రాములు, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

శివకుమార్‌ను సర్పంచ్‌గా కొనసాగించాలి

- ఉత్తర్వులు విడుదల చేసిన హైకోర్టు

రఘునాథపల్లి, జనవరి 11: రఘునాథపల్లి సర్పంచ్‌గా పోకల శివకుమార్‌ను కొనసాగించాలని హైకోర్టు జారీ చేసిన స్టే ఆర్డర్ కాపీని జిల్లా పంచాయతీ అధికారి రంగాచారికి శివకుమార్ గురువారం అందజేశారు. అట్రాసిటీ కేసులో అరెస్టయిన రఘునాథపల్లి సర్పంచ్ పోకల శివకుమార్‌ను పంచాయతీరాజ్ చట్టం-2018 సెక్షన్ 277 ప్రకారం సస్పెండ్ చేస్తూ కలెక్టర్ సిహెచ్.శివలింగయ్య ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ పంచాయతీ విభాగం అధికారులు ఈ నెల 6న ఉత్తర్వులు జారీ చేసిన విషయం విధితమే. దీంతో ఉప సర్పంచ్ యాద రాములు 8న సర్పంచ్‌గా బాధ్యతలు చేపట్టారు. దీంతో పోకల శివకుమార్ హైకోర్టును ఆశ్రయించగా, ప్రజల అవసరాల కోసమే పనిచేస్తున్న పోకల శివకుమార్‌కు తిరిగి సర్పంచ్‌గా బాధ్యతలు అప్పగించాలని హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది.

నా వేతనం పేదల సేవకే వెచ్చిస్తా

- లయన్స్ క్లబ్ సమావేశంలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

జనగామ కల్చరల్, జనవరి 11: శాసన సభ్యుడిగా తనకు లభించే వేతనం పేదల సేవకే వెచ్చిస్తానని జనగామ నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి అన్నారు. బుధవారం రాత్రి జనగామ జిల్లా కేంద్రంలో జరిగిన లయన్స్ క్లబ్ ఆఫ్ జనగామ ఆబాద్ సర్వసభ్య సమావేశానికి క్లబ్ అధ్యక్షుడు శ్రీభాష్యం రఘు అధ్యక్షత వహించగా ఎమ్మెల్యే పల్లా ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. నవంబరు నెలలో క్లబ్ సభ్యుడిగా తనకు నెల రోజుల పాటు అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని స్పాన్సర్ చేసే అవకాశం కల్పించి తన విజయంలో భాగస్వాములైన క్లబ్ సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. శాసనసభ్యుడిగా ఎన్నికై తొలిసారిగా సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే పల్లాను క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో క్లబ్ పూర్వ జిల్లా గవర్నర్లు లవకుమార్‌రెడ్డి, కన్నా పరశురాములు, కె.రాజ శేఖర్‌రెడ్డి, పప్పు వెంకట్‌రెడ్డి, పాశం శ్రీశైలం, వడిషర్ల ప్రవీణ్, అల్లాడి ప్రభాకర్‌రావు, నాగబండి రవీందర్, ఇ.ప్రభాకర్‌రెడ్డి, జి.సీతారాం, గౌస్ మొహి యుద్దీన్, పెద్ది వెంకటనారాయణ గౌడ్, శ్రీభాష్యం శేషాద్రి, ఇ.మల్లారెడ్డి, పి.నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పట్టణం అద్దంలా మెరవాలి

అడిషనల్ కలెక్టర్ పింకేశ్‌కుమార్



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ పింకేశ్‌కుమార్

జనగామ టౌన్, జనవరి 11: పారిశుధ్య పనులు పకడ్బందీగా నిర్వహించి జనగామ పట్టణాన్ని అద్దంలా మెరిసేలా తీర్చిదిద్దాలని అడిషనల్ కలెక్టర్ పర్మార్ పింకేశ్‌కుమార్ మునిసిపల్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన పట్టణంలోని 8, 18, 19, 26, 28 వార్డుల్లో పర్యటించారు. పారిశుధ్య పనుల తీరును గమనించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇంటి పన్నులు సకాలంలో వసూలు చేయాలన్నారు. నిర్దేశించిన టార్గెట్‌ను పూర్తి చేయాలని బిల్ కలెక్టర్లను ఆదేశించారు.

తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని దిశానిర్దేశం చేశారు. శానిటేషన్ పనులకు సంబంధించి ఫిర్యాదుల రిజిస్టర్‌ను తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. ఆయన వెంట మునిసిపల్ ఛైర్‌పర్సన్ పోకల జమున, ఇన్‌చార్జి కమిషనర్ చంద్రమౌళి తదితరులు ఉన్నారు.

ఏసీబీ వలలో జనగామ డీఎంహెచ్‌వో

- ఔట్‌సోర్సింగ్ ఫార్మసిస్ట్‌కు లంచం వేధింపులు
- రూ. 50 వేలు టేబుల్ డ్రాలో పెట్టిన బాధితురాలు
- పక్కా ప్లాన్‌తో పట్టుకున్న ఏసీబీ అధికారులు
- సహకరించిన జూనియర్ అసిస్టెంట్ అరెస్టు
- కలెక్టరేట్‌లోని కార్యాలయంలో ఘటన



డీఎంహెచ్‌వో ప్రశాంత్‌ను విచారిస్తున్న ఏసీబీ అధికారులు

జనగామ టౌన్, జనవరి 11: జనగామ జిల్లా వైద్యాధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ చేపూరి ప్రశాంత్ గురువారం ఏసీబీ వలలో చిక్కుకున్నారు. ఓ ఫార్మసిస్ట్ వద్ద లంచం పుచ్చుకుని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. జనగామ కలెక్టరేట్‌లోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఈ సంఘటన చోటుచేసుకుంది. డీఎంహెచ్‌వోతో పాటు జూనియర్ అసిస్టెంట్‌ను ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఏసీబీ డీఎస్పీ సాంబయ్య తెలిపిన వివరాలు... జనగామ మండలం యశ్వంతాపూర్ గ్రామానికి చెందిన స్రవంతి అనే యువతి 2021 నుంచి ఓబుల్‌కేశ్వాపూర్ ప్రాథమిక వైద్యశాలలో ఔట్‌సోర్సింగ్ కింద ఫార్మసిస్ట్‌గా పనిచేస్తోంది. పర్మనెంట్ ఉద్యోగి వచ్చారనే సాకు చూపించి ఆమెను 2023 అక్టోబర్‌లో తొలగించారు. అదే రోజు సాయంత్రం డీఎంహెచ్‌వో కార్యాలయం నుంచి ఆమెకు జూనియర్ అసిస్టెంట్ అజహర్ ఫోన్ చేశారు. తిరిగి ఉద్యోగం కావాలంటే డీఎంహెచ్‌వో కార్యాలయంలో కలవాలని సూచించారు. ఆమె డీఎంహెచ్‌వో కార్యాలయానికి వెళ్లగా, ఉద్యోగం కావాలంటే రూ.లక్ష ఇవ్వాలని చెప్పారు. తాను అంత ఇచ్చుకోలేనని డీఎంహెచ్‌వో ప్రశాంత్‌కు తెలిపింది. రూ.50వేల వరకు ఇస్తానని విన్నవించుకుంది.

ఈ క్రమంలో వారం కిందట రూ.50 వేలు చెల్లించింది. అయినా పోస్టింగ్ ఇవ్వకపోవడంతో ఆమె డీఎంహెచ్‌వోను ప్రశ్నించింది. మరో రూ.50వేలు ఇవ్వాల్సిందేనని జూనియర్ అసిస్టెంట్ ద్వారా డీఎంహెచ్‌వో చెప్పారు.

ఈ క్రమంలో బాధితురాలు ఏసీబీ అధికారులను సంప్రదించింది. వారి డైరెక్షన్‌లో రూ.50వేల నగదు తీసుకుని గురువారం డీఎంహెచ్‌వో కార్యాలయానికి వెళ్లింది. డీఎంహెచ్‌వో, జూనియర్ అసిస్టెంట్ సూచన మేరకు ఆ డబ్బులను కార్యాలయంలోని ఓ టేబుల్‌లో పెట్టింది. ఈ క్రమంలో అక్కడే మాటువేసి వున్న ఏసీబీ అధికారులు డీఎంహెచ్‌వో కార్యాలయంలోకి వెళ్లి డీఎంహెచ్‌వోతో పాటు జూనియర్ అసిస్టెంట్‌ను అదుపులోకి తీసుకున్నారు. లంచం డిమాండ్ చేసినట్లు విచారణలో ఒప్పుకోవడంతో ఇద్దరినీ అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. ఈ దాడుల్లో ఏసీబీ సీఐలు శ్యాంసుందర్, కె.శ్రీను, ఎస్.రవి తదితరులు పాల్గొన్నారు.

కేయూ పరీక్షల విభాగం ఉద్యోగులపై వేటు



సర్టిఫికెట్లకు డబ్బులు వసూలు చేశారనే ఆరోపణలు

కేయూ క్యాంపస్, జనవరి 11: కాకతీయ యూనివర్సిటీ పరీక్షల విభాగంలో పనిచేసే ఇద్దరు ఉద్యోగులపై వేటు వేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాకారి ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎం.తిరుమలదేవి గురువారం తెలిపారు. రెగ్యులర్ డిగ్రీ బీఏ, బీకామ్ విభాగంలో సెక్షన్ క్లర్క్‌లు పనిచేసే ఇద్దరు తాత్కాలిక ఉద్యోగులు డబ్బులు ఇస్తేనే విద్యార్థులకు, కళాశాలల యాజమాన్యాలకు పాస్ మెమోలు, ఇతర ధృవపత్రాలు ఇస్తున్నారని పలువురు ఫిర్యాదులు చేశారు. అవినీతి ఆరోపణలతో పాటు కళాశాల అధ్యాపకులపై దురుసుగా ప్రవర్తించడం, నేరుగా డబ్బులు అడగకుండా పైసలిస్తేనే పనులు చేస్తామనే ధోరణి ప్రదర్శించే వారని అధికారులు వెల్లడించారు. అలాగే సర్టిఫికెట్లు కళాశాలకు పంపామని, కళాశాల వారు వస్తే నేరుగా విద్యార్థులకే ఇస్తామనే కుంటిసాకులు చెబుతూ లంచాలు ఇస్తేనే సర్టిఫికెట్లు ఇచ్చేవారని అధికారులు వెల్లడించారు. గతంలో పరీక్షల విభాగంలో పనిచేసే వారిపై అనేక ఆరోపణలున్నప్పటికీ రాజకీయ నేతలు, ఉద్యోగ సంఘాల నేతల పలుకుబడితో అదే సెక్షన్‌లో కొనసాగారు.

అయితే ఇటీవల కేయూ ఆడిట్ ఆఫీసర్ ఎస్.కిష్టయ్య లంచలు తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడటంతో వర్సిటీలో అవినీతి, లంచాలకు మరిగిన ఉద్యోగులపై వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ టి.శ్రీనివాసరావులు కఠిన నిర్ణయాలకు దిగారు. పరీక్షల విభాగంలో అవినీతికి పాల్పడ్డ ఇద్దరు ఉద్యోగులను విధుల్లోకి రావొద్దని పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ మల్లారెడ్డి చెప్పారు. శనివారం తర్వాత వారికి మరో విభాగంలో విధులు కేటాయిస్తారనే ప్రచారం సాగుతోంది. అయితే వారిపై విచారణ చేపట్టి శిక్షించాలని వర్సిటీ వర్గాలు డిమాండ్ చేస్తున్నాయి. ఇదిలా ఉండగా, రెగ్యులర్‌గా ఉత్తీర్ణత సాధించే విద్యార్థులకు నేరుగా కళాశాలకు ధృవపత్రాలను పంపుతామని, రీవాల్యూవేషన్‌లో పాసయ్యే అభ్యర్థులకు నేరుగా పరీక్షల విభాగంలో పాస్ మెమోలను జారీ చేస్తామని పరీక్షల విభాగం అధికారులు వెల్లడించారు.

కారు బీభత్సం

ఇద్దరికి తీవ్ర గాయాలు







చెట్ల పొదల్లోకి దూసుకెళ్లిన కారు, తీవ్రంగా గాయపడ్డ బత్తిని రాజు, గుగులోతు వెంకన్న

స్టేషన్‌ఘన్‌పూర్, జనవరి 11: మండలంలోని ఇప్పగూడెం సమీపంలో పాలకుర్తి-ఘన్‌పూర్ రోడ్డు పైన కారు బీభత్సం సృష్టించగా ఇద్దరికి తీవ్రగాయాలు కాగా మరొకరికి స్వల్పగాయాలైన ఘటన గురువారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చిలుపూరు మండలంలోని, ఫత్తేపూర్ గ్రామానికి గుగులోతు వెంకన్న ఒక బైక్ పైన, హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని పీచర గ్రామానికి చెందిన బత్తిని రాజుతో పాటు మరో వ్యక్తి మరో బైక్ పైన ఘన్‌పూర్ నుంచి పాలకుర్తి వైపు వెళుతు న్నారు. ఈ క్రమంలో పాలకుర్తి నుంచి ఘన్‌పూర్ వైపు వస్తున్న కారు ఒక్కసారి గా ఎడమ వైపు నుంచి కుడివైపుకు దూసుకెళ్లి రెండు బైక్‌లను ఢీకొట్టింది. దీంతో రెండు బైక్‌లపై వెళుతున్న ముగ్గురు వ్యక్తుల్లో ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా మరొకరికి స్వల్పగాయాలైనట్లు తెలిపారు. సంఘటన జరిగినప్పటికీ పోలీసులు సకాలంలో స్పందించకపోవడంతో పాటు సంఘటనా స్థలం వద్దకు వెళ్లిన పోలీసులు క్షతగాత్రులపై నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.


'అధికారులు పూర్తి అవగాహనతో ఉండాలి'




పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పిస్తున్న మాధవి

మహబూబాబాద్ టౌన్, జనవరి 11 : ఆదాయపన్ను చెల్లింపుల విషయంలో అధికారులు, ఉద్యోగులు కేంద్రప్రభుత్వ నియమనిబంధనలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని కేంద్ర ప్రభుత్వ ఆదాయ పన్నుశాఖ జిల్లా ఇన్‌చార్జి అధికారులు సునిల్‌మిశ్రా, మాధవి అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో గురువారం కేంద్రప్రభుత్వ ఆదాయపన్ను శాఖ ఆధ్వర్యంలో అధికారుల కు ఆదాయపన్నుల చెల్లింపు, త్రైమాసిక, వార్షిక రిటర్న్ దాఖలుపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. అధికారుల పాటించాల్సిన నియమాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం అధికారులు అడిగిన సందేహాలను నివృత్తి చేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికారులంతా ఆదాయ పన్ను చెల్లింపుల్లో సమగ్ర అవగాహన ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు రమాదేవి, నాగన్న, సుబ్బారావు, వెంకటరమణ పాల్గొన్నారు.







ఇంటర్ విద్యార్థులకు సువర్ణావకాశం

● గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తులు

● ఈ నెల 15వ తేదీ వరకు గడువు

హనుమకొండ రూరల్, జనవరి 11: ఎస్సీ గురుకులాలు పేద విద్యార్థులకు వరంగా మారాయి. కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యను అందిస్తున్నాయి. గురుకులాల్లో ఏర్పాటు చేసిన ప్రతిభ కళాశాలలు (కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్స్) అసాధారణ ఫలితాలు సాధిస్తున్నాయి. ఈ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు ప్రతిష్ఠాత్మకమైన జాతీయస్థాయి ఉన్నత విద్యాసంస్థల్లో సీట్లు సాధిస్తూ బంగారు భవితకు బాటలు వేసుకుంటున్నారు. ఐఐటీ, నీట్‌లో ఈ కళాశాలల విద్యార్థులు ప్రతిభ చాటుతున్నారు. హనుమకొండ, వరంగల్ జిల్లాలకు కలిసి మడికొండలో బాలురకు 1, బాలికలకు 1 కళాశాల ఉంది. ఇందులో బైపీసీ 40, ఎంపీసీ 40 సీట్లు చొప్పున ఉన్నాయి. విద్యార్థులకు నచ్చినరంగాల్లో శిక్షణ ఇప్పిస్తూ వారిలోని సృజనాత్మకతను వెలికితీస్తున్నారు. చదువుతోపాటు క్రీడల్లో గురుకుల విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణిస్తున్నారు. గురుకుల విద్యాలయాల్లో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో చేరేందుకు అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. 2024-25 విద్యా సంవత్సరంలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో చేరేందుకు ప్రవేశపరీక్ష నిర్వహించి ప్రతిభ ఆధారంగా ఎంపిక చేయనున్నారు.

ఈ నెల 15వ తేదీ వరకు గడువు

ప్రస్తుత విద్యాసంవత్సరం పదోతరగతి చదువుతున్న విద్యార్థులు ఇంటర్ ప్రథమ సంవత్సరంలో చేరేందుకు ఈ నెల 15వ తేదీలోగా www.tswreis.ac.in, www.tsswreisjc.cgg.gov.in ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఎంపీసీ, బైపీసీ గ్రూపుల కోసం తమకు ఇష్టమైన కోర్సుకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇంగ్లీష్ మాధ్యమంలో విద్యాబోధన ఉంటుంది. సీఈవో కళాశాలల్లో ఇంటర్మీడియేట్ తరగతులతోపాటు ఐఐటీ, ఎన్ఐటీ, నీట్, క్లాట్, సీఎంఏ తదితర పోటీ పరీక్షలకు అవసరమైన శిక్షణ ఇస్తారు. నాణ్యమైన విద్యతోపాటు ఉచిత వసతి సౌకర్యం కల్పిస్తారు. ప్రవేశ పరీక్ష బహుళ ఐచ్ఛిక పద్ధతిలో తెలుగు, ఇంగ్లీషులో ఉంటుంది. ఫిబ్రవరి 4వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారు. అందులో మెరిట్ సాధించిన అభ్యర్థుల్లో 1:5 నిష్పత్తిలో రెండో స్క్రీనింగ్ పరీక్షకు ఎంపిక చేస్తారు. ఎంపికైన విద్యార్థులను రెండో విడతలో ఫిబ్రవరి 25న ఎంపిక చేసిన సెంటర్లలోనే 150 మార్కులకు మళ్లీ పరీక్ష నిర్వహిస్తారు. ఎస్సీలకు 75శాతం, బీసీలకు 12శాతం, ఎస్టీలకు 6శాతం, మైనార్టీలకు 3శాతం, ఇతరులకు మిగిలిన సీట్లు కేటాయించి ఆ మేరకు మెరిట్ జాబితాను ప్రకటించి ప్రవేశాలు కల్పిస్తారు.

ప్రతిభ ఆధారంగానే ఎంపిక

ఎస్.విద్యారాణి, ప్రాంతీయ సమన్వయ అధికారి వరంగల్ రీజియన్



ప్రతిభా కళాశాలలు అద్భుత విజయాలు, అనితర సాధ్యమైన ప్రతిభాపాటవాలకు చిరునామాగా నిలుస్తున్నాయి. అట్టడుగువర్గాల్లోని పిల్లల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతోపాటు అత్యున్నత స్థాయికి వెళ్లేందుకు గురుకులాలు బాటలు వేస్తున్నాయి. ఉచిత విద్యను అందించడంతోపాటు నిరుపేద విద్యార్థులు పైసా ఖర్చు లేకుండా ఐఐటీ, నీట్‌లాంటి జాతీయ పోటీపరీక్షల్లో కార్పొరేట్‌కు దీటుగా లాంగ్ టర్మ్ కోచింగ్ అందిస్తాం. గడువులోగా విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలి. ప్రతిభ ఆధారంగానే ఎంపిక చేసి ప్రవేశాలు కల్పిస్తాం.

అనుమానాస్పదస్థితిలో మహిళ మృతి

కమలాపూర్, జనవరి 11: మండలంలోని మర్రిపల్లిగూడెం గ్రామానికి చెందిన సదువాల రమ(45) అనే మహిళ అనుమానాస్పదస్థితిలో మృతి చెందినట్లు గురువారం పోలీసు ఇన్స్‌పెక్టర్ బొలిమల్ల సంజీవ్ తెలిపారు. భూపాలపల్లి జిల్లా రేగొండ మండలంలోని భాగిర్థిపేట గ్రామానికి చెందిన రమతో మర్రిపల్లిగూడెం గ్రామానికి చెందిన సదువాల స్వామికి 25 ఏళ్ల కిందట వివాహం జరిగింది. వారికి ఒక కుమారుడు ఉన్నాడు. స్వామి ట్రాక్టర్ డ్రైవర్‌గా, రమ వ్యవసాయ కూలి పనిచేసి జీవనం గడుపుతున్నారు.

కాగా, గురువారం ఉదయం ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన రమ కనిపించకుండా పోయింది సమీపంలో ఉన్న ఓ వ్యవసాయ బావి వద్ద చెప్పులు, దుప్పటి గ్రామస్థులకు కనిపించాయి. దీంతో వారి కుటుంబ సభ్యులకు తెలుపగా వెంటనే అక్కడికి చేరుకుని గ్రామస్తుల సహకారంతో మహిళ మృతదేహాన్ని బావిలోంచి బయటకు తీశారు. మృతురాలి సోదరుడు బొమిక సౌందరయ్య ఫిర్యాదు మేరకు రమది అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసు ఇన్స్‌పెక్టర్ తెలిపారు.

కారు పల్టీ - తప్పిన ప్రమాదం

ఐనవోలు, జనవరి 11: కారు అదుపుతప్పి పంట పొలాల్లో పడి పోయిన సంఘటన పున్నేలు క్రాస్‌రోడ్డు జాతీయరహదారిపై గురువారం రాత్రి జరిగింది. ప్రత్యక్షసాక్షుల కథనం ప్రకారం.. జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలం గోవర్ధనగిరికి చెందిన రషీద్ వరంగల్ నుంచి పంథిని వైపు కారులో వెళ్తున్నాడు. క్రాస్ రోడ్డు దాటాక కారు అతి వేగంగా కుడివైపు రోడ్డును దాటి ఆర్ అండ్‌బీ సూచికల బోర్డును ఢీకొట్టి 150 అడుగుల దూరంలో ఉన్న మొక్కజొన్న పంటచేనులో పడిపోయింది. కారులో డ్రైవర్ ఒక్కరే ఉన్నారు. కారు బెల్టు ధరించడం వలన స్వల్పగాయాలతో బయటపడ్డాడు. కారు కుడివైపున దూసుకపోయిన సమయంలో మరే వాహనం ఎదురుగా రాకపోవడంతో పెద్ద ప్రమాదమే తప్పినట్లయింది.




కొత్తకొండలో తాత్కాలిక ఆర్టీసీ బస్టాండ్‌ను పరిశీలిస్తున్న డీఎం శ్రీకాంత్

కొత్తకొండ జాతరకు ప్రతీరోజు 20 ఆర్టీసీ బస్సులు

భీమదేవరపల్లి, జనవరి 11: కొత్తకొండ జాతర బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని కొత్తకొండ జాతరకు ప్రతీ రోజు హుజూరాబాద్ నుంచి 80 ట్రిప్పుల ఆర్టీసీ బస్సులు నడపనున్నట్లు హుజూరాబాద్ డిపో మేనేజర్ శ్రీకాంత్ తెలిపారు. గురువారం కొత్తకొండ జాతరలో ఆర్టీసీ తాత్కాలిక బస్టాండ్‌ను పరిశీలించారు. బ్రహ్మోత్సవాలకు హుజూరాబాద్ డిపో నుంచి 20 బస్సులను రోజు 80 ట్రిప్పులు నడపనున్నట్లు తెలిపారు. పెద్దలకు రూ.60, చిన్నారులకు రూ.30 టికెట్ ధర నిర్ణయించినట్లు తెలిపారు. ఈ ప్రత్యేక బస్సులను హుజూరాబాద్ నుంచి వయా మాణిక్యాపూర్, ముల్కనూర్, కొత్తకొండకు ప్రయాణికులను చేరవేస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళా ప్రయాణికులకు ఉచితంగా జాతరకు చేరవేస్తామన్నారు. అనంతరం కొత్తకొండ శ్రీవీరభద్రస్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో క్యాంప్ ఇన్‌చార్జి ఉప్పుల భద్రయ్య, సర్పంచ్ దూడల ప్రమీల-సంపత్, ఆర్టీసీ డ్రైవర్ దూడల ఎల్లగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కేయూలో బట్టల పంపిణీ


బట్టలను పంపిణీ చేస్తున్న శ్రీనివాసరావు

కేయూ క్యాంపస్, జనవరి 11: కాకతీయ యూనివర్సిటీ పరీక్షల విభాగంలో ప్రతీ ఏడాది బోధనేతర ఉద్యోగులకు వర్సిటీ అందజేసే ఉచిత బట్టలను (డ్రెస్ కోడ్)ను గురువారం కేయూ పరీక్షల విభాగంలో కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ టి.శ్రీనివాసరావు, కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి ఉద్యోగులకు అందచేశారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ ప్రొఫెసర్ టి. శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ప్రతీ ఏడాది ఉద్యోగులకు డ్రెస్‌లను అందచేస్తామని, విధుల్లో ఉన్నప్పుడు డ్రెస్ కోడ్ పాటించాలని సూచించారు. డ్రెస్‌తో వర్క్ కల్చర్‌తో పెరుగుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పబ్లికేషన్ సెల్ డైరెక్టర్ డాక్టర్ ఎం.నరసింహరావు, ఎఫ్‌ఓ తోట రాజయ్య, కేయూ టెక్నికల్ అసోషియేషన్ అధ్యక్షుడు డాక్టర్ పుల్లా శ్రీనివాస్, ఎ.నందయ్య, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు అబ్దుల్ షకూర్, పోలేపాక కోర్నేల్, మల్లికాంబు, మజార్ అలీ, విజయ్,ఎల్లస్వామి తదితరులు పాల్గొన్నారు.

మోగిన ఐలోని మల్లన్న డోలు

జాతరకు ముస్తాబైన ఐనవోలు మల్లికార్జునస్వామి ఆలయం

విభిన్న పద్ధతుల మిళితం.. జానపదుల జాతరగా ప్రాశస్త్యం

రాణి రుద్రమదేవి సైతం సంతానప్రాప్తికి పూజలు



'సకం భాగ్యాలు కలిగి... సంతోషమాత భక్తి కలిగి... అవులు గోవులు కలిగి... అవాలక్ష కావాల్లు కలిగి... ముట్టింది ముచ్చమై పట్టింది బంగారమెమ్మై.. పాలి వాడు దగ్గరై పగవాడు దూరమై.. ఏటికి ఎడ్లు కలిగి పాటికి బర్లు కలిగి... పర్వ తాల మల్లయ్యా... మా పాలి కలిగి ఉండి... పతి పార్వతిలా కొరిమే" అంటూ ఒగ్గు పూజారులు ఢమురుకాల శబ్దాల నడుమ కొలువనుండగా మల్లన్న జాతర వైభవంగా జరగనుంది. ఈ జాతర జానపదుల జాతరగా ప్రాచుర్యం పొందింది. మకర సంక్రమణతో ప్రారంభమయ్యే జాతర ఉగాది వరకు సాగనుంది. కాకతీయుల కాలంలో మొదలైన ఈ క్రమం.. కాలాలు మారినా దినదినం ఇంకా వెలుగొందుతూనే ఉంది. మరో మూడు రోజుల్లో మొదలయ్యే ఈ జాతరలో భక్తులు ఆచరించే తంతుపై ప్రత్యేక కథనం..



ఐనవోలు, జనవరి 11: ఐనవోలు మల్లికార్జునస్వామి(మల్లన్న) జాతర భక్తులకు ఎంతో ప్రాశస్త్యమైనది. పూర్వ కాలంలో జానపదుల జాతరగా కీర్తి గడించి, శైవారాధన పూజలు అందుకుంది. 1100 యేళ్ల కిందట కోరమీసాల మల్లన్న కొలువయ్యాడని భక్తుల విశ్వాసం. విభిన్న శైవాగామ పద్ధతుల్లో నిత్యపూజలు అందుకునే మల్లన్న స్వామి ఒక చేతిలో ఖడ్గం మరోచేతిలో త్రిశూలం ఢమురకం తలపై కిరీటం మూతిపై మీసం ఒక ప్రత్యేకతగా దర్శనమిస్తాడు. నిర్వికారి నిరహంకార నిరాకారస్థితి లింగస్వరూపంలో మూలవిరాట్ అర్ధప్రానపట్టం శ్వేత వర్ణము కలిగి ఉండటం ఇక్కడ మరో విశేషంగా భావిస్తారు. ఖండోభ అవతారంలో స్వామి వారికి భార్యలు కుడిపక్క గొల్ల కేతమ్మ ఎడమ పక్కన బలిజ మేడమ్మలు కొలువయ్యారు. ప్రతీ రోజు శైవాగమ పద్ధతినను సరించి మహన్యాసపూర్వక రుద్రాభిషేకం నిర్వహిస్తారు. ముఖ్య పూజల్లో భక్తులు బోనాలు, పట్నాలతో నైవేద్యం సమర్పిస్తారు.

చెలుక, నజరు పట్నం.. పెద్దపట్నం..

మొక్కులతో ఆలయానికి వచ్చే భక్తులు ముందుగా ఒగ్గు పూజారులతో పట్నాలు వేయించుకోని మొక్కులు చెల్లించాకే స్వామి వారిని దర్శించుకుంటారు. బండారి పలుకపై తెల్లపిండి పసుపు కనుగోల్లు దోశెడు బియ్యం పోసి మైలపోలు తీస్తారు. కుడుక, పోక, ఖర్జూర, పసుపు గౌరవమ్మను పెట్టి రైక మలపు తెల్లతువ్వాల పెట్టి మైలపోలు తీశాక తంగడిపచ్చతో చల్లి తెల్లపిండిలో పలుక కోట్టి పట్నం(పటం) వేసి మల్లన్న కథలు చెప్పుతారు. శరణు మల్లేశా.. అంటూ పాటలోనే కల్యాణం చేసి పట్నం మీద అక్షింతలు వేస్తారు. ఒక్కపొద్దు విడిచి స్వామి వారిని దర్శించుకుంటారు. పెద్దపట్నం వేసి స్వామి కథను చెప్పుతారు. జానపదుల అవాహనాల్లో పట్నం అంటే ఆసనం రూపకంలో శివుడిని ఆహ్వానించడం అన్నమాట. స్వామివారికి ఉదయం మేలుకోలుపు, రాత్రి పవలింపు ఒగ్గు పూజారులే చేయం అనావాయితీగా వస్తోంది.

బోనం.. నైవేద్యం..

బోనం అన్నంలో పాలు, బెల్లంతో పరామాన్నం వండుతారు. కాకరకాయ, చిక్కుడుకాయ, వంకాయ, గుమ్మడి కాయ అన్ని కలిపి వండి పచ్చి పులుసుతో నైవేద్యం సమర్పిస్తారు. ఆలయంలో స్వామి వారికి ఉదయం బాల బోగం, మధ్యాహ్నం మహా నైవేద్యం, సాయంత్రం ప్రదోశకాల బోగం సమర్పిస్తారు.

బండారి పసుపు.. గజ్జెల లాగు..

తెలుపు బొట్టు విభూది పెట్టుకున్న వారితో మరణం ఉండకూడదని మణిమల్లాసురులనే రాక్షసులు బ్రహ్మతో వరం పొందారు. ఆదే రాక్షసులను సంహరించేందుకు పసుపు (బండారి) బొట్టు, గజ్జెల లాగు తొడిగి జాలి ముసుగు వేసుకొని కొరడా, త్రిశూలం, ఢమురకంతో వచ్చి మల్లికార్జునస్వామి రాక్షసులను సంహరించడాని భక్తుల విశ్వాసం. భక్తులు పసుపును కిలోల కొద్ది తీసుక వచ్చి స్వామివారికి సమర్పించి వెంట కొంత తీసుకెళ్లారు. ఒగ్గు పూజారుల కథల్లో మల్లన్నకు - మంగోలియా దేశానికి పసుపు సంబంధం కనిపిస్తుంది.

శివసత్తులు.. శివసతులు..

జాతరలో ఎటు చూసినా శివసత్తుల పూనకాలే కనిపిస్తాయి. శివసతులే శివసత్తులుగా పిలువబడుతున్నారు. శివుడికి నాట్యం అంటే ఇష్టం మహిళలు శివుడిని కల్యాణం చేసుకునే సంప్రదాయం పూర్వ కాలం నుంచి వస్తోంది. అందులో భాగంగానే పునకాల నడుమ నృత్యాలు చేస్తారు. పురుషులు మహిళా వేషాధారణలో తన్మయం చెందుతారు.

కొడే కట్టుట.. టెంకాయ బంధనం

శివుడి వాహనం కొడే(నంది) కోరికలు తీరితే కోడెను కడతారు. పెళ్లి కాని వారు, సంతాన లేమి, తదితర సమస్యలు ఉత్పన్నమైనప్పుడు మొక్కుబడి టెంకాయ బంధనం చేస్తారు. కొబ్బరికాయ, పసుపు, కుంకుమ, జాకెట్ ముక్క ముడుపు కట్టుతారు. కోరికలు తీరాక ముడుపు విప్పి మొక్కుబడిని చెల్లిస్తారు. ఇది తరతరాలుగా వస్తున్న భక్తుల నమ్మకం సంప్రదాయం. ఒడి బియ్యం పసుపు, నూనెతో కలిపి పోకచెక్కలు, ఖర్జూర పండ్లు, ఇద్దరు అమ్మవార్లకు చీరలు, జాకెట్ ముక్కలు, గాజులు పెట్టుతారు. స్వామి వారికి దోతి, తువ్వాల సమర్పిస్తు ఒడి బియ్యం పోసి మొక్కు తీర్చుకుంటారు. రాణి రుద్రమదేవి సైతం తన కూతురు ముమ్మడమ్మకు సంతానప్రాప్తి కోసం ఐదు రోజులు ఇక్కడే ఉండి మొక్కుకున్నట్లు చరిత్ర ఆధారాలు స్పష్టం చేస్తున్నాయి.

గండ దీపం.. శేవాలు..

గండాలు తీరితే గండదీపం పెడతారు. తలపై దీపం పెట్టుకొని ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేస్తారు. పిల్ల, జెల్ల చల్లగా ఉంటే శేవాలు తీస్తామని మొక్కుకున్న వారు తలనీలాలు సమర్పిస్తారు. ఆలయంలో మల్లన్న స్వామి పుట్టమన్ను రూపంలోనే కొలువయ్యాడు. మల్లికార్జునస్వామిని ఇలవేల్పు దైవంగా భావించే యాదవులు, కుర్మలు, ఇలవేల్పులుగా కొలిచే మరిన్ని కులాల వారు జాతరకు ముందు పుట్టమన్నుతో ఇంట్లో మల్లన్న గద్దెలు నిర్మించుకొని రోజు సాయంత్రం ఇళ్లలో డోలు మోగిస్తారు. నెలపట్టులు నస్టేడు (ఏడు) వారాలు పండుగను జరుపుకుంటారు. ఇళ్లలో డోలు మోగించి నెల రోజుల పాటు భక్తిపారవశ్యంతో మాంసాహారం, మద్యానికి దూరంగా ఉంటూ జాతరకు వచ్చి దర్శనం చేసుకుంటారు. పాలు, పెరుగు బయటికి ఇవ్వకుండా నేతిని చేసి స్వామి వారికి దీపంగా సమర్పిస్తారు.

నృత్యమండపంలో సల్లవద్దనం

బండారిని పూసుకున్న భక్తులు కాకతీయుల నృత్య మండపంలో కొరడాల మధ్య శివనాట్యం చేసి మల్లన్నను స్మరిస్తూ సల్ల కవ్వం (మజ్జిగ) చేసి స్వీకరిస్తారు. దీనిని చూడటానికి భక్తులు వేలసంఖ్యలో హాజరవుతారు. శివసత్తుల నృత్యాలు మండపాన్ని మారుమోగించగా పసుపుమయవుతుంది.

సంక్రాంతికే ప్రభల జాతర

సంక్రాంతి వరకు మొదటి పంట వండి రెండో పంట రైతు ఇంటికి చేరుకుంటాయి. ధాన్యం దిగుబడులు పెరుగాలని పశుసంపద వృద్ధి చెందాలని ప్రభల బండ్లలను (ఎద్దుల బండ్లు) సుందరంగా అలంకరించి ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేయడం అనవాయితీగా వస్తోంది. మార్నేని వంశీయులు పెద్ద రథంను (శిడి) అందంగా ముస్తాబుచేసి గ్రామంలోని పురవీధుల గుండా మహానివేదనను ఆలయానికి తీసుకవస్తారు. దీనిని అనుసరించి వివిధ గ్రామాల నుంచి వచ్చే బంతిపూల బండ్లు తిరుగుతాయి. సాయంత్రం నుంచి తెల్లవారేవరకు శోభ సంతరించుకుంటుంది. దీనిని బట్టే జానపదుల జాతరగా పిలుబడుతుందని ప్రచారంలో ఉంది.

జాతర, వారాలు

ఐలోని జాతరకు సంబంధించి డిసెంబరు 17న ఆదివారం రోజున స్వస్తిశ్రీ శోభకృత్‌నామ సంవత్సర మార్గశిర శుద్ధ పంచమిన దృష్టికుంభం ప్రారంభమైంది. ఆపై జాతర మకర సంక్రమణంతో ప్రారంభమై ఉగాది వరకు కొనసాగుతుంది. ఈ నెల 13న ధ్వజారోహణముతో ఉత్సవాలు ప్రారంభమై 14న భోగి పండుగ 15న మకర సంక్రాంతి ఈ రెండు రోజుల్లో లక్షలాది మంది భక్తులు స్వామి వారిని దర్శించుకుంటారు. తర్వాత ఉగాది వరకు ప్రతీ ఆది, బుధ వారం వారంతపు జాతర సాగుతుంది. మొత్తం 11 వారాల జాతరకు లక్షల భక్తులు సుదూర ప్రాంతాల నుంచి వచ్చి దైవ దర్శనం చేసుకొని మొక్కులు చెల్లించుకుంటారు.

ఫ్రీ వీఐపీ పాస్‌ల రద్దు

భీమదేవరపల్లి, జనవరి 11: కొత్తకొండ శ్రీవీరభద్రస్వామి దేవాలయ ఆదాయం పెంచేందుకు ఫ్రీ వీఐపీ పాస్‌ల జారీని రద్దు చేసినట్లు ఆలయ ఈవో కిషన్‌రావు తెలిపారు. ఇక వీఐపీ పాస్‌లను రూ. 200 ధర పెట్టి కొనుగోలు చేయాల్సిందేనని ఈవో గురువారం విలేకరులతో తెలిపారు. మంత్రి పొన్నం ప్రభాకర్ వారం కిందట దేవాదాయ, వివిధ శాఖలాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అందులో ఎడాపెడా వీఐపీ పాస్‌లు జారీ చేస్తున్నారని పలువురు పేర్కొన్నారు. దీంతో వీఐపీ పాస్‌లు రద్దు చేయాలని మౌఖికంగా ఆదేశాలు జారీ చేశారు. ఒక్కో వీఐపీ పాస్‌ను రూ.200కు జారీ చేయాలని ఈవోకు సూచించారు. అంతేకాకుండా వీఐపీ పాస్‌లను రూ.1.50 లక్షలు పెట్టి తమ పార్టీ నాయకులు, కార్యకర్తల కోసం మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేకంగా కొనుగోలు చేశారు.

ఐనవోలు జాతరలోనూ..

ఐనవోలు: ఐనవోలు మల్లికార్జునస్వామి జాతరలో ఈ సారి వీఐపీ పాసులు రద్దు అయ్యాయి. వాటి స్థానంలో వీవీఐపీ టికెట్లను జారీ చేస్తున్నారు. ఒక్కో టికెట్ ధర రూ.500కు ఖరారు చేశారు. దీనికోసం ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేస్తున్నారు. యేటా జాతర సందర్భంగా వీఐపీ పాస్‌లు ఇచ్చేవారు. ఒక్కో పాస్‌పై రూ.500 తీసుకొని రశీదు ఇచ్చేవారు. ఒక పాస్‌పై ఐదుగురు దర్శనానికి వెళ్లేవారు. కిందటేడు వీఐపీ పాసులపై రూ.2.50 లక్షల ఆదాయం సమకూరింది. అయితే వీఐపీ పాస్‌లు రాజకీయంగా పక్కదారి పడుతున్నాయని విమర్శలు వచ్చాయి. దీనిపై ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు వీఐపీ పాస్‌లు జారీ చేయవద్దని సూచిస్తు తాను టిక్కెట్ కొనుగోలు చేసి క్యూలైన్లో వస్తానని చెప్పడంతో పాస్‌లను ముద్రించలేదు. యేటా పలువురు తమ బంధువులు, స్నేహితులు, తెలిసినవారు వేలాదిమందిని వీఐపీ క్యూలైన్లో దర్శనాలు చేయించేవారు దీంతో ఈసారి ఆ పద్ధతికి చెక్‌పెట్టడంతో ఆదాయం పెరుగనుంది. ఆలయంలో స్వామి వారి దర్శనాలు, ధర్మదర్శనం(ఉచితం), శీఘ్ర దర్శనం టిక్కెటు ధర (రూ.50), విశిష్ట దర్శనం టిక్కెటు ధర (రూ.100), వీవీఐపీ టిక్కెటు ధర (రూ.500) ఖరారు చేసినట్లు ఈవో అద్దంకి నాగేశ్వర్‌రావు తెలిపారు.


ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న డాక్టర్ రామగల్ల పరమేశ్వర్

వరంగల్ లోక్‌సభ అభ్యర్థిగా ప్రకటించాలి

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నేత డాక్టర్ రామగల్ల పరమేశ్వర్

వడ్డెపల్లి, జనవరి 11: వరంగల్ లోక్‌సభ అభ్యర్థిగా తనను ప్రకటించాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నేత, మాజీ ఎంపీపీ డాక్టర్ రామగల్ల పరమేశ్వర్ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. గురువారం బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దళిత సామాజిక వర్గానికి చెందిన తాను డాక్టర్‌గా, కాంగ్రెస్ పార్టీ నాయకుడిగా చేసిన సేవలను గుర్తించి లోక్‌సభ సీటును కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. 1996 నుంచి 2001 వరకు చేర్యాల ఎంపీపీగా, జిల్లా డీఆర్‌డీఏ బాడీ సభ్యుడిగా, వరంగల్ గ్రంథాలయ శాఖ డైరెక్టర్‌గా కాకుండా.. జిల్లాలోని అనేక నియోజక వర్గాల ఇన్‌చార్జిగా పనిచేసిన అనుభవం ఉందన్నారు. తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించానని చెప్పారు. 2009 జనరల్ ఎన్నికల్లో వరంగల్ లోక్‌సభ మహాకూటమి అభ్యర్థిగా, 2014లో వరంగల్ లోక్‌సభకు మహాకూటమి అభ్యర్థిగా పోటీ చేశానని చెప్పారు. అపారమైన రాజకీయ అనుభవం ఉన్న తనకు వరంగల్ లోక్‌సభ స్థానాన్ని కేటాయించి సముచిత స్థానం కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర, జిల్లా నేతలు ఉడమల బాల్‌రెడ్డి, మంచాల చిరంజీవి, గోగికార్ కృష్ణకుమార్, ఉప్పుల రాములు, గౌరవేని శివకుమార్, ముస్కాల జార్జి తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ నేత నారాయణను కలిసిన లెనిన్


నారాయణకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న లెనిన్

సుబేదారి, జనవరి11: సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావులను హైదరాబాద్‌లోని సీపీఐ పార్టీ కార్యాలయంలో గురువారం జర్నలిస్టు నాయకుడు బీఆర్ లెనిన్ కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఇండియా కూటమి వరంగల్ పార్లమెంట్‌అభ్యర్థిగా తన పేరును పరిశీలించాలని ఈ సందర్భంగా లెనిన్ విజ్ఞప్తి చేశారు. లెనిన్ వెంట సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు ఉన్నారు.

వరంగల్ ఎంపీ అభ్యర్థిగా అవకాశం ఇవ్వాలి

హనుమకొండ రూరల్: వరంగల్ పార్లమెంట్ అభ్యర్థిగా అవకాశం ఇవ్వాలని హనుమకొండ గోపాల్‌పూర్ ప్రాంతానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు జన్నె మొగిలి గురువారం హైదరాబాద్‌లోని బీజేపీ కార్యాలయంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం శాలువతో ఘనంగా సన్మానించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జన్నె మొగిలి మాట్లాడుతూ.. భారతీయ జనతా పార్టీలో సుమారు 26 యేళ్లుగా పనిచేస్తూ, జిల్లాలోని అన్ని సామాజిక వర్గాలతో సత్సంబంధాలు కలిసి ఉన్నట్లు పేర్కొన్నారు. వరంగల్ ఎంపీగా బీజేపీ తరుపున పోటీ చేసేందుకు అవకాశం కల్పించాలని వినతిపత్రంలో కోరినట్లు తెలిపారు.

గోపాల్‌పూర్ చెరువులో గుడిసెల కూల్చివేత

ఇంటి స్థలాలు కేటాయించాలని సీపీఎం నేతల డిమాండ్

వడ్డెపల్లి, జనవరి 11: గ్రేటర్ వరంగల్ 56వ డివిజన్‌పరిధిలోని గోపాల్‌పూర్ చెరువులో పేదలు వేసుకున్న గుడిసెలను జిల్లా యంత్రాంగం గురువారం తెల్లవారు జామున కూల్చివేసింది. రెవెన్యూ, నీటిపారుదల శాఖ, ఇతర ప్రభుత్వ శాఖల అధికారులు పోలీసుల ఆధ్వర్యంలో చెరువులోని గుడిసెలను కూల్చివేయడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. గోపాల్‌పూర్ చెరువు శిఖం సర్వే నంబర్ 89లో సుమారు 20 ఎకరాల పైచిలుకు భూమి ఉంది. రెండేళ్ల కిందట సీపీఎం ఆధ్వర్యంలో ఇల్లులేని పేదలు చెరువు శిఖంలోని స్థలాన్ని చదును చేసి అక్కడే గుడిసెలు వేసుకొని నివసిస్తున్నారు. గురువారం తెల్లవారుజామున రెవెన్యూ, నీటి పారుదల శాఖలతో పాటు ఇతర ప్రభుత్వ శాఖల అధికారులు పోలీసులతో ఎక్స్‌కావేటర్‌తో గుడిసెలను నేలమట్టం చేశారు. గుడిసెలను ప్రభుత్వ యంత్రాంగం తొలగించడంతో గుడిసెలు వేసుకున్న పేదలు నిరాశ్రయుల య్యారు. పేదలు ప్రభుత్వ స్థలంలో వేసుకున్న గుడిసెలను తొలగించడం దుర్మార్గమని సీపీఎం నేతలు తేలూరి ఉప్పలయ్య, వాంకుడోతు వీరన్న, కూస రాజేష్‌లు ఆరోపించారు. జిల్లా యంత్రాంగం ఇప్పటికైనా పునరాలోచన చేసి పేదలకు ఇంటి స్థలాలు కేటాయించి ప్రభుత్వమే ఇళ్లను నిర్మించి ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు.


గుడిసెవాసులతో కలిసి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

కలెక్టరేట్ ఎదుట ధర్నా

సుబేదారి: గోపాలపురం చెరువు శిఖంలో 2 యేళ్ల నుంచి గుడిసెలు వేసుకుని నివసిస్తున్న పేదలకు సంబంధించిన గుడిసెలను కూల్చడాన్ని నిరసిస్తూ సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ముందుగా ఆర్ట్స్ కళాశాల ఆడిటోరియం నుంచి పెద్ద సంఖ్యలో గుడిసెవాసులతో సీపీఎం నాయకులు ర్యాలీగా వచ్చి కలెక్టరేట్ ఎదుట బైఠాయించారు. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్‌రావు మాట్లాడుతూ.. అర్ధరాత్రి మునిసిపల్ సిబ్బంది పోలీసుల సహాయంతో గుడిసెలు తొలగించడం సరైంది కాదన్నారు. అనంతరం గుడిసెవాసుల డిమాండ్స్‌తో కూడిన వినతిపత్రాన్ని సీపీఎం నాయకులు కలెక్టర్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు సారంపెల్లి వాసుదేవరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం. చుక్కయ్య, జిల్లా కమిటీ సభ్యులు వీరన్న, వెంకట్, తిరుపతి, కిశోర్‌తోపాటు గుడిసెవాసులు పాల్గొన్నారు.

ఈనెల 13న ఆర్ట్స్ కాలేజీ మైదానంలో కైట్ ఫెస్టివల్

హనుమకొండ, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని ఈనెల 13న శనివారం సుబేదారిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో కైట్ ఫెస్టివల్ (పతంగుల పండుగ)ను నిర్వహించనున్నారు. జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఈ కైట్ ఫెస్టివల్ ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు జరుగుతుంది. సంక్రాంతి పర్వదినాన గ్రామాల్లో, పట్టణాల్లో పిల్లలు, పెద్దలు రంగు రంగుల పతంగులను ఎగురవేయడం ఆనవాయితీ. ప్రాచీనకాలంగా వస్తున్న సంప్రదాయం. యాంత్రిక జీవనం వల్ల పతంగులను ఎగురవేయడం ఇటీవల కాలంలో చాలా తగ్గింది. పట్టణీకరణ వల్ల మైదాన ప్రాంతాలు కనుమరుగై పతంగులు స్వేచ్ఛగా ఎగురవేసే పరిస్థితులు కూడా లేకుండా పోయాయి.

ఈ పరిస్థితుల నేపథ్యంలో నగరవాసులకు పతంగుల ఎగురవేతలో ఉన్న ఆనందాన్ని మరోసారి కలుగచేసేందుకు ఈ కైట్ ఫెస్టివల్‌ను నిర్వహిస్తున్నారు. గతంలో 2017లో నగరంలో జాతీయ స్థాయి కైట్ ఫెస్టివల్‌ను నిర్వహించింది తెలిసిందే. కలెక్టర్ పమేలా సత్పత్తి హయాంలో 2019లో కూడా ఒకసారి రాష్ట్ర స్థాయి పతంగుల పండుగను ఇదే ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలో నిర్వహించారు. మళ్లీ ఇప్పుడు సంక్రాంతికి ఒక రోజు ముందు శనివారం కైట్ ఫెస్టివల్‌ను నిర్వహించనున్నారు.


ఎంజీఎంలో ఆందోళన చేస్తున్న నర్సులు

నర్సులను దూషించిన స్వీపర్‌పై చర్యలు తీసుకోవాలి

ఎంజీఎంలో విధులు బహిష్కరించి నర్సుల ఆందోళన

హనుమకొండ అర్బన్, జనవరి11: సేవే లక్ష్యంగా విధులు నిర్వహిస్తున్న నర్సులను అకారణంగా దూషించిన స్వీపర్ రాజమ్మపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ నర్సులు ఆందోళన చేపట్టారు. గురువారం మధ్యాహ్నం విధులు బహిష్కరించి పరిపాలన విభాగం ఎదుట ధర్నా, ఆందోళన చేశారు. రోగులు చికిత్స పొందుతున్న వార్డులో పారిశుధ్య చర్యలు నిర్వహించకపోవడంతో సంబంధిత వార్డు హెడ్ నర్సు పద్మలత విషయాన్ని అధికారులకు ఫిర్యాదు చేసింది. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని స్వీపర్‌గా విధులు నిర్వహిస్తున్న రాజమ్మ అనే మహిళా ఉద్యోగి హెడ్‌నర్సుపై దురుసుగా ప్రవర్తించి దుర్భాషలాడింది. అంతేకాకుండా ఎంజీఎంలో విధులు నిర్వహిస్తున్న నర్సులందరినీ ఉద్దేశించడంతో ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్ దృష్టికి తీసుకెళ్లారు. ఫిర్యాదు చేసినా చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ ఆందోళనకు దిగారు. నర్సుల మనోభావాలు దెబ్బతీసే విధంగా ప్రవర్తించిన స్వీపర్‌ను విధుల నుంచి తొలగించే వరకు విధులకు హాజరు కాకుండా ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకుంటామని, విధులకు హాజరు కావాలని సూపరింటెండెంట్ కోరడంతో నర్సులు ఆందోళన విరమించారు. ఈ ఆందోళనలో వివిధ విభాగాల నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

'అగ్రంపహాడ్'కు భారీ బందోబస్తు

ఈస్ట్‌జోన్ డీసీపీ రవీందర్


జాతర రోడ్ల ఏర్పాట్లను పరిశీలిస్తున్న పోలీసు అధికారులు

ఆత్మకూరు, జనవరి 11: రాష్ట్రంలో రెండో అతిపెద్దజాతరైన అగ్రంపహాడ్ సమ్మక్క-సారలమ్మ జాతరకు వచ్చే లక్షలాది మంది భక్తులకు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఈస్ట్‌జోన్ డీసీపీ రవీందర్ తెలిపారు. గురువారం ఆత్మకూరు మండలంలోని అగ్రంపహాడ్‌లో సమ్మక్క-సారాలమ్మలను ఆయన సందర్శించారు. ఆ సందర్భంగా పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వరంగల్, దుర్గంపేట, ఆత్మకూరు నుంచి అలాగే చౌళ్లపల్లి ద్వారా వచ్చే రోడ్డు పెద్దాపురం నుంచి జాతరకు వచ్చే రోడ్లను డీసీపీ పరిశీలించారు. జాతర చుట్టూ రెండు కిలోమీటర్ల వరకు పంటలు వేయవద్దని పోలీసు అధికారులు స్థానికులకు సూచించారు. గతంలో కంటే ఈసారి భారీగా భక్తులు తరలి వస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. స్థానిక మాజీ ఎంపీటీసీ బోరిగం స్వామిని పోలీసులు వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం డీసీపీ మాట్లాడుతూ.. జాతర చుట్టూ పోలీస్ పెట్రోలింగ్‌తో పాటు మఫ్టీలో స్పెషల్ పార్టీ పోలీసుల నిఘా ఉంటుందన్నారు. జాతరలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పటిష్ఠమైన భద్రత చేసి క్షణాలలో పోలీసులు చేరకునేవిధంగా ఏర్పాట్లు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పరకాల ఏసీపీ కిషోర్‌కుమార్, సీఐ రవిరాజు, ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ జగన్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

రేపు రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

కాళోజీ జంక్షన్, జనవరి 11: సంక్రాంతి పండుగను పురస్కరించుకొని శనివారం హనుమకొండ రెడ్ క్రాస్ సొసైటీ ప్రాంగణంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు రెడ్ క్రాస్ పాలక వర్గ సభ్యుడు చెన్నమనేని జయశ్రీ తెలిపారు. ఈ ముగ్గుల పోటీలు ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు ఉంటాయని ఆమె తెలిపారు. పోటీల్లో గెలుపొందిన మహిళలకు మొదటి బహుమతి రూ.2016, రెండో బహుమతి రూ.1,116, మూడో బహుమతి రూ.516లు ఉంటాయని సొసైటీ వైస్ చైర్మన్ పెద్ది వెంకటనారాయణ గౌడ్ తెలిపారు. ప్రోత్సాహక బహుమతులతోపాటు పోటీల్లో పాల్గొన్న వారందరికీ గిఫ్టులు అందజేస్తామని ఆయన తెలిపారు. పోటీల్లో పాల్గొనే మహిళలు సెల్ నంబర్లు 83673 56765 / 83670 56765 లను సంప్రదించి పేర్లను నమోదు చేసుకోవాలని తెలిపారు. లేకుంటే ఇక్కడికి వచ్చాన నమోదు చేసుకోవచ్చన్నారు.

పాఠశాలల్లో ముందస్తు సంక్రాంతి సంబరాలు



సెయింట్ మేరీస్ పాఠశాలలో భోగి మంటలు వేస్తున్న ప్రిన్సిపాల్ జైమోన్ థామస్



శ్రీ అరబిందో పాఠశాలలో సంక్రాంతి ఉత్సవాల్లో విద్యార్థులు



లింగాలఘణపురం కేజీబీవీలో భోగి మంటలు పెడుతున్న ఉపాధ్యాయురాళ్లు

● ముగ్గులతో అలరించిన విద్యార్థులు

జనగామ కల్చరల్, జనవరి 11: జిల్లా వ్యాప్తంగా పాఠశాలల్లో ముందస్తు సంక్రాంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. సంస్కృతి సంప్రదాయాలు ఉట్టిపడేలా దుస్తులు ధరించారు. ముగ్గులు పరిచి, భోగిమంటలు వేసి, పాలు పొంగించారు. పొంగలి పాయసం రుచి చూశారు. గురువారం జనగామ జిల్లా కేంద్రం లోని సెయింట్ మేరీస్ పాఠశాలలో ప్రిన్సిపాల్ జైమోన్ థామస్ భోగి మంటలు వెలిగించి సంక్రాంతి ఉత్సవాలు ప్రారంభించారు. తెలుగు భాషా ఉపాధ్యా యులు, పీఆర్ఓ రంగరాజు ప్రసాద్ సంక్రాంతి పండుగ విశిష్టతను విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా పాఠశాలలో మహిళా ఉపాధ్యాయులు స్వయంగా పాలు పొంగించి పొంగలి ప్రసాదం తయారు చేశారు. ఉపాధ్యాయులు ప్రవీణ, నర్మద, జ్యోతిలక్ష్మి, హేమలత, రమణారెడ్డి, జయపాల్‌రెడ్డి, ప్రమీల, వాణిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

- శ్రీ అరబిందో పాఠశాలలో ..

జిల్లా కేంద్రంలోని శ్రీ అరబిందో పాఠశాలలో ముందస్తు సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఇ.ప్రభాకర్ రెడ్డి సారథ్యంలో వైస్ ప్రిన్సిపాల్ కె.వాసుదేవరెడ్డి భోగిమంటలు వెలిగించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి భోగిమంటల చుట్టూ నాట్యం చేస్తూ తిరుగుతూ పాటలు పాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె.రాజిరెడ్డి, సరిత, రమ్య, స్రవంతి, ప్రభావతి, లుంబానాయక్ తదితరులు పాల్గొన్నారు. ఎంపీపీఎస్ వడ్లకొండ లో ముందస్తు సంక్రాంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన చిన్నారులకు బహుమతులు పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు చిర్ర సత్యనారాయణరెడ్డి, వీరనరసయ్య, రాజేశ్వరి, సుకన్య, లుడియా, మాధవిలత పాల్గొన్నారు. వెంకిర్యాల ప్రాథమిక పాఠశాలలో ముందస్తు సంక్రాంతి వేడుకలు నిర్వహించారు.

● కొడకండ్ల : మండలకేంద్రంలోని ఎస్సీకాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గురువారం విద్యార్థులు ముందస్తు సంక్రాంతి సంబరాలను జరుపు కున్నారు. శుక్రవారం నుంచి సంక్రాంతి సెలవులు ప్రారంభం కానుండడంతో గురువారం విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి స్వయంగా తయారు చేసుకున్న గాలిపటాలపై అభ్యసన కృత్యాలు రాసి చదువుతూ వాటిని ఎగురవేశారు. బాలికలు పోటీపడి రంగురంగుల ముగ్గులతో పాఠశాల ఆవరణను శోభాయమానంగా తీర్చిదిద్దారు. ప్రధానోపాధ్యాయుడు దోర్నం ప్రభాకర్, ఉపాధ్యాయులు కుసుమ రాజు, గడ్డం కవితలు చిన్నారులకు తగు సలహాలు, సూచనలిస్తూ ప్రోత్సహించారు.

● లింగాలఘణపురం : మండలంలోని అన్ని పాఠశాలల్లో ముందస్తు సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేజీబీవీ, మోడల్ స్కూల్, పీవీఆర్ పాఠశాలల్లో రంగురంగుల ముగ్గులను అందంగా వేసి సంక్రాంతి ఉత్సవాల ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ అన్నపూర్ణ, మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ పుష్పకుమారి, పీవీఆర్ చైర్‌పర్సన్ శ్రీలతారెడ్డి, డైరెక్టర్ వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● పాలకుర్తి : మండలంలోని విస్నూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ముందస్తు సంక్రాంతి పండుగను గురువారం విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. సంక్రాంతి, భోగి పండుగ పాఠశాల ఆవరణలో ముత్యాల ముగ్గులు వేసి సంబరాలు చేశారు. విజేతలకు బహుమతులు అందచేశారు. గ్రామ సర్పంచ్ నకీర్త యాకయ్య, ప్రధానోపాధ్యాయుడు పెనుగొండ సోమన్న, సోమయ్య, నాగరాజు, ఉపాధ్యాయులు కవిత పాల్గొన్నారు.

● స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్ : డివిజన్ కేంద్రం స్టేషన్ ఘన్‌పూర్, శివునిపల్లి ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం బాలికలకు ఉపాధ్యాయినులు ముగ్గుల పోటీలు ఏర్పాటు చేశారు. బాలురకు పతంగుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో హెచ్‌ఎంలు ప్రవీణ్‌కుమార్, సదామోహన్, రఘుప్రసాద్, లక్ష్మీ ప్రసాద్ పాల్గొన్నారు.

● జఫర్‌గఢ్ : గ్రామీణ ప్రజల జీవన సంస్కృతిని ప్రతిబింబించే సరదాల సంక్రాంతి పండుగ ఇంకా మూడు రోజులు ఉండగానే సందడి మొదలైంది. పండుగ సెలవుల నేపథ్యంలో గురువారం పాఠశాలలు, కళాశాలల్లో ముందస్తు సంక్రాంతి సంబురాలు జరుపుకున్నారు. మండలంలోని కూనూరు హైస్కూల్, ప్రాథమిక పాఠశాలలతో పాటు ఇతర విద్యాలయాల్లో బాలబాలికలు రంగవల్లులు, పతంగులతో సందడి చేశారు.

● బచ్చన్నపేట : మండల కేంద్రమైన బచ్చన్నపేటతో పాటు గ్రామాల్లోని పాఠశాలల్లో సంక్రాంతి సంబురాలు ముందే కనిపించాయి. పలు పాఠశాలల్లో విద్యార్థులు అందంగా ముగ్గులు వేయడంతో పాటు, పలు పోటీల్లో పాల్గొని విజేతలుగా నిలిచారు. మండల కేంద్రంలోని వాణీ స్కూల్‌లో వినూత్నంగా విద్యార్థుల తల్లిదండ్రులకు పోటీలు నిర్వహించారు. ముగ్గులు, వీల్‌చైర్, టగ్ ఆఫ్ వార్, స్పీడ్‌వాక్, పాటల పోటీలు ఆడించి పాడించారు. విజేతలకు కరస్పాండెంట్ భాస్కరుని సుమలత బహుమతులు అందించారు.

● చిలుపూర్ : సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని ఆయా గ్రామాల్లో గల ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో మినీ సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గురువారం మల్కాపూర్, వెంకటేశ్వర్లపల్లి, వాచ్యాతండా తదితర గ్రామాల్లో ప్రాథమిక పాఠశాలల్లో చిన్నారులచే రంగురంగుల రంగవల్లులను వేయించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు అంద్రు శ్రీదేవిరెడ్డి, కమలాకర్, కవిత మాట్లాడుతూ, తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకునేందుకే సంక్రాంతి పండుగను జరుపుకుంటామని పేర్కొన్నారు. కళ్యాణి, రమేష్ పాల్గొన్నారు.

భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలి

- జనగామ రూరల్ సీఐ ఎడవల్లి శ్రీనివాసరెడ్డి



వన దేవతల జాతర ప్రాంగణంలో మాట్లాడుతున్న రూరల్ సీఐ శ్రీనివాస రెడ్డి

చిలుపూర్, జనవరి 11 : వచ్చే నెల (ఫిబ్రవరి) 21 నుంచి 28 వరకు నిర్వహించే సమ్మక్క సారలమ్మ వన దేవతల జాతరకు సంబంధించి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని జనగామ రూరల్ సీఐ ఎడవల్లి శ్రీనివాస రెడ్డి గ్రామస్థులకు సూచించారు. గురువారం మండలంలోని లింగంపల్లి గ్రామాన్ని సందర్శించిన ఆయన స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి సమ్మక్క సారలమ్మ వన దేవతలను దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేపట్టి అమ్మవారికి మొక్కులు సమర్పించారు. అనంతరం సీఐ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ, జాతర సందర్భంగా విచ్చేసే భక్తుల రద్దీకనుగుణంగా తాగునీటి వసతి, పార్కింగ్ స్థలం కేటాయింపు, ట్రాఫిక్ నియంత్రణ చర్యలతో పాటు, సీసీ కెమెరాలను ఏర్పాటు చేసేందుకు అవస రమైన చర్యలు చేపట్టేందుకు సహకరించాలని సూచించారు. జాతరను విజయ వం తం చేసేందుకు ప్రతీఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సై బొ ల్లం వినయ్‌కుమార్, సర్పంచ్ ఏదునూరి రవిందర్, మాటూరి శ్రీనివాస్, కండ్లకోలు బాలరా జు, తుత్తూరు రాజు, మామిడాల బాలరాజు, అపరాధపు రాజు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలను జయప్రదం చేయండి



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న పోగుల సారంగపాణి

స్టేషన్‌ఘన్‌పూర్, జనవరి 11: కడియం ఫౌండేషన్ సహకారంతో, స్వాగత్ యూత్ ఆధ్వర్యంలో జనవరి 12, 13, 14 తేదీల్లో మండలంలోని ఛాగల్ గ్రామంలో 16వ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలను నిర్వహించనున్నారు. క్రీడాకారులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పోగుల సారంగపాణి కోరారు. గురువారం ఛాగల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న కబడ్డీ పోటీల నిర్వహణ ఏర్పాట్లను ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలను 16వసారి నిర్వహిస్తున్నామని తెలిపారు. పోటీలను శుక్రవారం (12న) మధ్యాహ్నం 3గంటలకు ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించనున్నారని తెలిపారు. ఇప్పటికే 60 టీమ్‌లు వారి పేర్లను నమోదు చేసుకున్నారని తెలిపారు. 12వ తేదీ మధ్యాహ్నం 3గంటలకు పోటీలకు సంబంధించిన డ్రాషీట్‌ను క్రీడాకారుల సమక్షంలో తీస్తామని తెలిపారు. ఎవరైనా వారి టీమ్ పేరు నమోదును 12వ తేదీ మధ్యాహ్నం 2గంటల వరకు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. పోటీలకు వచ్చే క్రీడాకారులకు ఉచిత భోజనవసతి కల్పిస్తున్నట్లు తెలిపారు. వివరాలకు 99668 68076, 97019 49689, 99666 38001 నెంబర్లను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ పొన్న రజిత-రాజేష్, స్వాగత్ యూత్ అధ్యక్షుడు కూన రాజు, రంగు యాకయ్య, అన్నెపు కుమార్, సౌదరపల్లి సంపత్‌రాజ్, అన్నెపు ఐలయ్య అన్నెపు అనిల్ పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలలో స్వయంపాలన వేడుకలు

బచ్చన్నపేట, జనవరి 11: తెలంగాణ ఆదర్శ పాఠశాలలో గురువారం స్వయంపాలన దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయుల పాత్ర పోషిస్తూ అనుభూతులు సొంతం చేసుకున్నారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో పట్టుదల పెంచి, ఉన్నత స్థాయికి ఎదిగేందుకు దోహదం చేస్తాయని, ప్రిన్సిపాల్ కృష్ణవేణి, ఎస్‌ఎంసీ చైర్మెన్ గొల్లపల్లి బాపురెడ్డిలన్నారు. డీఈవోగా భరణి, డిప్యూటీ డీఈవోగా దీక్షిత, ఎంఈవోగా సౌమ్య, నోడల్ అధికారిగా రాఘవేంద్ర, హెచ్‌ఎంగా సమీరలు ఒకరోజు విధులు నిర్వర్తించారు. ఉత్తమ బోధన చేసినవారికి బహుమతులు అందించడంతో పాటు, పాల్గొన్న వారికి జ్ఞాపికలు అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తిరుమల నాథుడికి వెండి కిరీటం బహూకరణ



తిరుమల నాథస్వామికి వెండి కిరీటం అందిస్తున్న సతీష్ దంపతులు

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, జనవరి 11: పవిత్ర ధనుర్మాస ఉత్సవాలను పురస్కరించుకుని గురువారం తిరుమల నాథస్వామి దేవాలయానికి స్టేషన్ ఘన్‌పూర్‌కు చెందిన కొలిపాక సతీష్, సునిత దంపతులు వెండి కిరీటం బహూకరించారు. గోదాదేవి అమ్మ వారికి అలంకరించడానికి ఆయన కిరీటాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ బాధ్యులు కలకోట రంగాచారి, యాద శ్రీనివాస్, ఎస్.అంజనేయులు, నరేందర్, గోలి శ్రీను, తెల్లాకుల రామకృష్ణ, పూజారి రాము తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

జఫర్‌గఢ్, జనవరి 11 : మండలంలోని కూనూరు జడ్పీ హైస్కూల్ విద్యార్థులు బాల్‌బ్యాడ్మింటన్ క్రీడలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వరంగల్‌లో ఇటీవల బాలబాలికలకు ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి పోటీలను నిర్వహించారు. బాల్ బ్యాడ్మింటన్ క్రీడా పోటీల్లో కూనూరు హైస్కూల్‌కు చెందిన రామగిరి చరణ్‌తేజ, కస్తూరి భాను, శవనబోయిన పూజిత, సుతారి రిషిత, చిదురాల శృతి, దాట్ల అక్షయ అనే ఆరుగురు విద్యార్థులు పాల్గొని విశేష క్రీడా ప్రతిభను కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల పీఈటీ యాదగిరి గురువారం తెలిపారు. కాగా, అత్యుత్తమ క్రీడా నైపుణ్యంతో రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులను మంగళవారం పాఠశాలలో హెచ్‌ఎం పర్వేజ్, పీఈటీ యాదగిరి, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, రమేశ్, చంద్రమోహన్, రవి, గిరిజ, ప్రభాకర్, స్వరూపారాణి, రాజెందర్, వేణు, విజయశ్రీ, సిరాజ్, కరుణశ్రీ, శంకర్, ఉమ, శ్రీనివాస్, విజయ్‌కుమార్ అభినందించారు. మరింత పట్టుదల, ప్రతిభతో రాణించి ఉన్నత స్థితికి చేరుకోవాలని వారు ఆకాంక్షించారు.

రాష్ట్ర స్థాయి చిత్ర లేఖన పోటీల్లో గురుకులం విద్యార్థి ప్రతిభ

స్టేషన్‌ఘన్‌పూర్‌టౌన్, జనవరి 11: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకులాల రాష్ట్ర స్థాయి ఇ గ్రైట్ ఫెస్ట్ చిత్ర కళల పోటీలో స్టేషన్ ఘన్‌పూర్ గురుకులం విద్యార్థులు ప్రథమ స్థానం దక్కించుకున్నారు. ఈ నెల 8 నుంచి 10 వరకు హైదరాబాద్‌లో నిర్వహించిన పోటీల్లో టి.విక్రమ్ (ఇంటర్) ప్రథమ స్థానం దక్కించుకున్నాడు. అలాగే మెరిట్ సర్టిఫికెట్, 10 వేల రూపాయల నగదు బహుమతి గురుకులాల సంస్థ కార్యదర్శి నవీన్ నికోలస్ చేతుల మీదుగా పొందాడు. పోటీల్లో రాణించిన విక్రమ్‌ను గురుకులం ప్రిన్సిపాల్ కాళహస్తి, చిత్ర లేఖన ఉపాధ్యాయుడు వేణు మాధవ్, యాదాద్రి రీజినల్ కో ఆర్డినేటర్ రజని, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

హమారా విలేజ్ టీం కృషి అభినందనీయం

బచ్చన్నపేట, జనవరి 11: తాము చదువుకున్న పాఠశాలను అందంగా ముస్తాబు చేయడంతో పాటు, విద్యార్థులకు ఆటవస్తువులు అందించిన పలువురు పూర్వ విద్యార్థులు స్థానికుల ప్రశంసలు పొందడంతో పాటు, మిగతా గ్రామాల ప్రజలకు ఆదర్శంగా నిలిచారు. మండల కేంద్రానికి చెందిన కె ఉదయ్‌కుమార్, కె శ్రీనివాస్, కె కార్తీక్, సద్దాం, రాజశేఖర్, కిరణ్, చంద్రంలు బచ్చన్నపేట బురుజు వద్ద గల ప్రైమరీ పాఠశాలలో ఐదో తరగతి వరకు చదువుకున్నారు. హమారా విలేజ్ పేరిట పలు సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా బడి గుడి లాంటిదని, దాన్ని అందంగా ముస్తాబు చేస్తే చిన్న పిల్లలను ఆకర్షించే విధంగా ఉంటుందని వారు భావించారు. రూ. 1.50 లక్షలతో పాఠశాలకు పెయింటింగ్ చేయించడంతో పాటు, గోడలపై బొమ్మలను వేయించారు. విద్యార్థులకు బ్యాగులు, బుక్స్, కుర్చీలు, ఇతర స్టేషనరీ అందించారు. ఈ సందర్భంగా గురువారం పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్‌ఐ సతీష్, సర్పంచ్ వడ్డేపల్లి మల్లారెడ్డిలు పూర్వ విద్యార్థుల సేవానిరతిని కొనియాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకున్నాక, తాము చదివిన పాఠశాలల బాగోగులు పట్టించుకోవాలని కోరారు. ఇలాంటి కార్యక్రమంలో మిగతా గ్రామాలకు ఆదర్శంగా నిలుస్తాయన్నారు. పూర్వ విద్యార్థులను అభినందించి, సన్మానించారు. హెచ్‌ఎం రఘువీర్, నాయ కులు నల్లగోని బాలకిషన్‌గౌడ్, ఎస్‌ఎంసీ చైర్మెన్ నర్సింహులు, హమారీ విలేజ్ టీం సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

చిలుపూర్ మబ్బుగుట్ట సమ్మక్క జాతర చైర్మన్‌గా బోళ్ళ రాజ్‌కుమార్

చిలుపూర్, జనవరి 11 : చిలుపూర్ మండల కేంద్రంలోని మబ్బుగుట్ట సమ్మక్క సారలమ్మ జాతర కమిటీ చైర్మన్‌గా గ్రామానికి చెందిన బోళ్ళ రాజ్‌కుమార్‌ను గ్రామస్థులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గురువారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయ అవరణలో సర్పంచ్ ఉద్దెమారి రాజ్‌కుమార్ అధ్యక్షతన, ఎంపీపీ బొమ్మిశెట్టి సరిత -బాలరాజు సమక్షంలో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా గ్రామస్తులంతా పార్టీలకతీతంగా చైర్మన్‌గా రాజ్‌కుమార్ వైపు మొగ్గు చూపారు. అదేవిధంగా ఉపాధ్యక్షులుగా తోట శ్రీనివాస్, శివరాత్రి సాంబయ్య, శ్రీరామోజు వీర నారాయణ, పిట్టల జంపయ్య, శివరాత్రి వెంకటయ్య, ప్రధాన కార్యదర్శిగా గుగ్గిల నవీన్‌కుమార్, కోశాధికారిగా దోకె శ్రీనివాస్‌తో పాటు, సభ్యులుగా 9 మందిని ఎన్నుకున్నారు.

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి

జఫర్‌గఢ్, జనవరి 11 : మండల కేంద్రంలో ఉన్న ఆర్టీసీ స్థలంలో అక్రమంగా ఆక్రమించేందుకు యత్నించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ అధికారులు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. జఫర్‌గఢ్‌లో స్థానిక ప్రధాన రహదారి పక్కన గల సర్వే నంబరు 201లో ఉన్న 1200 గజాల ఆర్టీసీ స్థలంలో కొందరు వ్యక్తులు ముళ్ల కంప వేసి, హద్దు రాళ్లు నాటారు. గ్రామస్తుల సమాచారంతో ఆర్టీసీ స్టేషన్‌ఘన్‌పూర్ బస్ స్టేషన్ మేనేజర్ రఘువీర్, విలేజ్ బస్ ఆఫీసర్ పట్టపురి నాగేశ్వర్, సీపీఎం, సీపీఐ నేతలు, గ్రామస్తులతో కలిసి స్థలాన్ని పరిశీలించారు. ఆర్టీసీ స్థలాన్ని ఆక్రమించేందుకు వేసిన కంపను దగ్ధం చేసి, నాటిన హద్దు రాళ్లను తొలగించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు గురువారం ఆ స్థలాన్ని సందర్శించి పరిశీలించారు. స్థలాన్ని పరిశీలించిన వారిలో సీపీఐ మండల కార్యదర్శి జువారి రమేశ్, సీపీఎం మండల నేత కాట సుధాకర్, వార్డు సభ్యులు కుక్కల ఎల్లయ్య ఆర్టీసీ ఉద్యోగ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.



ఆర్టీసీకి చెందిన స్థలం వద్ద ఆర్టీసీ అధికారులు, ప్రజలు

క్రీడాకారుడికి జడ్పీటీసీ ప్రోత్సాహం

లింగాలఘణపురం, జనవరి11: మండలంలోని నవాబుపేటకు చెందిన గోగికార్ చందు ఇటీవల జనగామ జిల్లా కేంద్రంలో జరిగిన 19వ జాతీయ అంతర్‌జిల్లా జూనియర్ అథ్లెట్‌మీట్ అండర్-16లో 4కేజీ షాట్‌పుట్‌లో జాతీయ స్థాయికి ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా స్థానిక జడ్పీటీసీ గుడి వంశీధర్‌రెడ్డి క్రీడాకారుడు చందును అభినందించి ప్రోత్సహించారు. ఈనెల 12 నుంచి 19వరకు గుజరాత్‌లో జరిగే జాతీయస్థాయి పోటీల్లో చందు పాల్గొంటున్న నేపథ్యంలో రూ. 5వేల ఆర్థిక సాయం అందించారు.

ఇద్దరు మహిళలకు జైలు శిక్ష

రఘునాథపల్లి, జనవరి 11: స్టేషన్‌ఘన్‌పూర్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని రఘునాథపల్లి మండలం మేకలగట్టు తండాకు చెందిన బానోతు రేణుక, బానోతు బద్రి అనే ఇద్దరు మహిళలు బైండోవర్ ఉల్లంఘించినందుకు తహసీల్దార్ పి.యుగేందర్ గురువారం రూ.లక్ష జరిమానా లేదా సంవత్సరం జైలు శిక్ష విధించారు. వారు జరిమానా డబ్బులు చెల్లించకపోవడంతో సంవత్సరం జైలు శిక్ష అనుభవించేందుకు వరంగల్‌లోని ప్రత్యేక మహిళా కారాగారానికి తరలించినట్లు స్టేషన్‌ఘన్‌పూర్ ఎక్సైజ్ సిహెచ్‌వో భాస్కర్ రావు తెలిపారు. రఘునాథపల్లి మండలంలోని మేకలగట్టు తండా కు చెందిన బానోతు రేణుక, బానోతు బద్రి అనే ఇద్దరు మహిళలు గతంలో నాటు సారా తయారు చేసి అమ్ముతుండగా అరెస్టు చేసి రఘునాథపల్లి తహసీల్దార్ పి.యుగేందర్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. ఎక్సైజ్ ఎస్‌ఐ నరేష్, హెడ్ కానిస్టేబుల్ యాకుబ్, కానిస్టేబుళ్లు శ్రీనివాస రావు, సలీం, దస్తగిరి, ఉమారాణి పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు ఆహ్వానం

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, జనవరి 11: స్టేషన్ ఘన్‌పూర్ ప్రభుత్వ మోడల్ స్కూల్‌లో 2024-25 సంవత్సరానికి ప్రవేశాల కోసం విద్యార్థులు శుక్రవారం నుంచి దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ శ్రీకాంత్ ఒక ప్రకటనలో కోరారు. 6వ తరగతి, 7 నుంచి 10వ తరగతి ఖాళీగా ఉన్న సీట్ల కోసం ఆన్‌లైన్‌లో ఫిబ్రవరి 22 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. తెలంగాణ ఎంఎస్.సీజీజీ.గవ్.ఇన్ వెబ్‌సైట్‌లో ఓసీలు రూ.200లు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ, ఈడబ్ల్యూఎస్ వారు రూ.125లు ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఘనంగా వడ్డె ఓబన్న జయంతి

జనగామ కల్చరల్, జనవరి 11: తెలంగాణ వెనుకబడిన తరగతుల శాఖ ఆధ్వర్యంలో వడ్డె ఓబన్న జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. గురువారం జిల్లా కలెక్టరేట్ లో జిల్లా వెనుకబడిన తరగతుల శాఖ అధికారి బి.రవీందర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షులు కేడిదల పోచయ్య శివరాత్రి కుమార్ ముఖ్య అతిథులుగా హాజరై ఓబన్న చిత్ర పటం వద్ద జ్యోతి ప్రజ్వలన చేసి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అదనపు కలెక్టర్ సుహాసిని, సీపీఓ ఇస్మాయిల్, డీఎంహెచ్‌వో ప్రశాంత్, జౌళి శాఖ అధికారి చౌడేశ్వరి పాల్గొన్నారు.

అయోధ్య రాముడి అక్షింతల వితరణ

జనగామ కల్చరల్, జనవరి 11: అయోధ్య రాముని అక్షింతల వితరణ కార్యక్రమం కొనసాగుతుంది. గురువారం జనగామ మండలం పెంబర్తి లో జరిగిన వితరణ కార్యక్రమంలో రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు గ్రామ కమిటీ సమావేశంలో ట్రస్టు జిల్లా సహ సంయోజక్ దొంతుల శేఖర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఇప్పటి వరకు జిల్లాలోని చాలా గ్రామాల్లో అక్షింతల వితరణ కార్యక్రమం పూర్తయిందన్నారు. 15వ తేదీ వరకు ప్రతి ఇంటికీ అక్షింతలు చేరే విధంగా కమిటీలు పనిచేస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో మోహన కృష్ణ భార్గవ, సత్యనారాయణ, సోమ నర్సింహచారి, బాలగాని శ్రీనివాస్, నిడిగొండ శంకర్, పులిగిల్ల సుఖేష్ పాల్గొన్నారు.

అంబేద్కర్ ఓపెన్ వర్సిటీ లో ప్రవేశాలకు గడువు పెంపు

జనగామ కల్చరల్, జనవరి 11: అంబేద్కర్ ఓపెన్ వర్సిటీలో యూజీసీలో ప్రవేశాలకు ఈ నెల 31కి గడువు పొడిగించినట్లు అధికారులు గురువారం ఒక ప్రకటన లో తెలిపారు. ప్రవేశం పొందాలనుకునే వారు జిల్లా కేంద్రం లోని ఏబీవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్టడీ సెంటర్ లో సంప్రదించాలని తెలిపారు. అదే విధంగా ద్వితీయ, తృతీయ సంవత్సరం విద్యార్థులు ఈ నెల 31న వరకు ట్యూషన్ ఫీజు చెల్లించాలన్నారు. వివరాలకు 73829 29687 నంబరులో సంప్రదించాలని సూచించారు.

అథ్లెటిక్స్ శిక్షణలో జిల్లా వాసి ఉత్తమ ప్రతిభ

జనగామ కల్చరల్, జనవరి 11: అథ్లెటిక్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నిర్వహిస్తున్న లెవెల్-2 శిక్షణ లో జిల్లా వాసి ఉత్తమ ప్రతిభ కనబరిచాడు. జనగామ జిల్లా చిల్పూరు మండలం ఎర్రకుంట తండాకు చెందిన బానోతు రవీందర్ శిక్షణ పూర్తి చేసుకుని ఏ గ్రేడ్ సాధించినట్లు అసోసియేషన్ ప్రతినిధులు గురువారం తెలిపారు. రవీందర్ ప్రస్తుతం గచ్చిబౌలి స్టేడియంలో కోచ్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. లెవెల్ - 2 శిక్షణ పూర్తి చేసి లెవెల్-3 కి ఎంపికైన రవీందర్‌ను తెలంగాణ అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి సారంగపాణి, ద్రోణాచార్య అవార్డు గ్రహీత నాగపురి రమేష్, పుల్లల గోపిచంద్, సెలబ్రిటీ స్పోర్ట్స్ ఫౌండేషన్, జనగామ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పెద్ది వెంకటనారాయణ గౌడ్, కార్యదర్శి గంగిశెట్టి మనోజ్‌కుమార్, సభ్యులు చందు, అశోక్, రంజిత్, గజ్జల్లి రాజు, కిరణ్, రాజు అభినందించారు.

చిన్నారులను పనిలో పెట్టుకోవద్దు

పాలకుర్తి, జనవరి 11 : 18 ఏళ్ల లోపు చిన్నారి బాలలను పనిలో పెట్టుకోకూడదని బాలల పరిరక్షణ విభాగం అధికారి ప్రకాష్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో పోలీసులు, బాలల పరిరక్షణ అధికారులు పెట్రోల్ బంకులు, హోటళ్లు, బట్టలు దుకాణాలు, షోరూంలను సందర్శించి తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ప్రకాష్ మాట్లాడుతూ పద్దెనిమిదేళ్ల లోపు చిన్నారులు పనిలో కాదని బడిలో ఉండాలన్నారు . ఒకవేళ ఎవరైనా పనిలో పెట్టుకుంటే యాజమానులపై కేసులు నమోదు చేస్తామన్నారు.

ఆహార ప్రాముఖ్యతపై అవగాహన

లింగాలఘణపురం, జనవరి11: మండలంలోని కిష్టగూడెం ప్రాథమిక పాఠశాలలో నోడల్ ఆఫీసర్ విష్ణుమూర్తి ఆధ్వర్యంలో ఆరోగ్యకరమైన ఆహారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రోటీన్లు, విటమిన్లు పుష్కలంగా కలిగి ఉండే ఆహారపదార్థాలపై కరిక్యులమ్‌లో భాగంగా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్‌ఎంసీ చైర్‌పర్సన్ మాధవి, ఉపాధ్యాయురాలు అరుణోదయ, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

కెన్యాతండాలో వింత గొర్రె పిల్ల జననం

పాలకుర్తి, జనవరి 11 : మండలంలోని భీక్యానాయక్ పెద్దతండా గ్రామ శివారులోని కెన్యాతండాలో రెండు తలల వింత గొర్రెపిల్ల జన్మించిన ఘటన గురువారం జరిగింది. తండాకు చెందిన రైతు గుగులోతు సంక్రు చెందిన గొర్రెకు రెండు తలల వింత (గుడ్ల గూబ) ఆకారంలో గొర్రెపిల్ల జన్మించింది. ఈ వింత గొర్రెపిల్లను చూడడానికి చుట్టూ పక్కల తండాల నుంచి గిరిజనులు తండోప తండాలు వచ్చి తిలకిస్తున్నారు. ఈ గొర్రె పిల్ల ఆరోగ్యంగా ఉందని రైతు సంక్రు తెలిపాడు. ఈ విషయంపై పాలకుర్తి పశు వైద్యాధికారి మారపెల్లి శశాంక్‌రెడ్డిని వివరణ కోరగా జన్యుపరమైన లోపం వల్లనే వింత అప్పుడప్పుడు ఇలాంటి ఘటనలు జరుగుతాయని, వింత ఆకారంలో జన్మించిన గొర్రెపిల్ల కాని మరేదైన జంతువు కాని పుడితే ఎక్కు వ కాలం బతకలేవని స్పష్టం చేశారు.

దుకాణాల్లో పోలీసుల ముమ్మర తనిఖీలు

జఫర్‌గఢ్, జనవరి 11 : మండల కేంద్రంలో గురువారం ఎస్‌ఐ మహేందర్ నేతృత్వంలో పోలీసులు స్థానిక కిరాణ షాపులు, పాన్‌షాపులు, జనరల్ స్టోర్‌లలో ముమ్మర తనిఖీలు నిర్వహించారు. స్కూల్ విద్యార్థులే లక్ష్యంగా హైదరాబాద్ నగరంలో పలు కిరాణ షాపులు, పాన్‌షాపుల్లో గంజాయి చాక్లెట్లను విక్రయిస్తున్న ఓ ముఠాను పోలీసులు పట్టుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో వరంగల్ పోలీసు కమిషనరేట్ ఆదేశాల మేరకు గురువారం కిరాణ, పాన్ షాపులు, పాఠశాలలు, కళాశాలల సమీపంలో గల దుకాణాల్లో పోలీసులు సోదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మహేందర్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు, గంజాయి లాంటి నిషేధిత మత్తు పదార్థాలు ఎవరేని విక్రయించినా, సరఫరా చేసినా వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ

రఘునాథపల్లి, జనవరి 11: ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోషియేషన్ మండల కమిటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం సభ్యులకు సంబంధించిన కార్యాలయంలో సంఘం నాయకులు గురువారం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు పి.పరమాత్మ, అధ్యక్షుడు గుండ వెంకటయ్య, ఉపాధ్యక్షులు రంగు యాదగిరి, తాళ్లపల్లి యాదగిరి, ప్రధాన కార్యదర్శి మరకాల చంద్రారెడ్డి, కోశాధికారి దుబ్బాక యాదగిరి, సహాయ కార్యదర్శి గూడ వెంకటనారయణ, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.